# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
2-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 192

UBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయా రెడ్డి!



దానం నాగేందర్ విషయంలో పునరాలోచన

ప్రజా వ్యతిరేకత వస్తుందని భావన

పీజేఆర్ కుమార్తెను బరిలో దింపే ఛాన్స్

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్ పెద్ద తలనొప్పిగా మారుతోంది. ఈ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తలుపు తట్టినా ప్రయోజనం లేకుండా పోయింది.

- మిగతా 2వ పేజీలో

## కాంగ్రెస్ వ్యవస్థల రాజకీయం!




- మిగతా 3వ పేజీలో

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్

ప్రతి దేశంలో ఎన్నికల ప్రక్రియ సంస్కరణల దిశగా అడుగులు వేస్తోంది. మనదేశంలో కూడా ఎన్నికల కమిషన్ సంస్కరణల దిశగా అడుగులు వేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కాలంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, పారదర్శకతను పెంపొందించేందుకుగాను ఈ సంస్కరణలను ఆహ్వానించాల్సిందే.

ఎన్నికల సంస్కరణలపై హస్తం రివర్స్..

తాము ప్రవేశపెట్టిన ఈవీఎంలపైనే అనుమానం

గెలిచినప్పుడు లేని అభ్యంతరాలు.. ఇప్పుడు కొత్తగా.

సరికాదంటున్న విశ్లేషకులు



## బిజెపిపై జగన్ యుద్ధం!

ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిరసనలు

మద్దతు తెలపనున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

కేంద్ర పెద్దలతో చివరి సంబంధాలు కూడా తెంచుకునేందుకు వైసిపి అధినేత సిద్ధం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జాతీయస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ కూటమిలో కూడా లేదు. ఇప్పటివరకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి అనుకూలంగా ఉండేది ఆ పార్టీ. నేరుగా స్నేహం చేసే పరిస్థితి లేదు

- మిగతా 3వ పేజీలో

## రేవంత్ మరో బాంబు!

హైదరాబాదులో స్టార్ హోటళ్లు, విల్లాలు, సర్వీస్ అపార్ట్మెంట్లు అన్నీ కేటీఆర్ వే

ఆధారాలతో సహా చూపిస్తా

సిరిసిల్ల నుంచి ముఖ్యమంత్రి కీలక ప్రకటన

డిఫెన్స్‌లో గులాబీ పార్టీ



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో!: గులాబీ అగ్రనేతల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చాలా దూకుడుగా ఉన్నారు. ఇప్పటివరకు వారి ఆస్తులపై, ఫామ్ హౌస్ లపై మాట్లాడారు. ఆధారాలతో సహా ఆరోపణలు చేశారు.

- మిగతా 2వ పేజీలో



## పట్టభద్రుల ఎమ్మెల్సీ పై బీఆర్ఎస్ ఫోకస్!

ఆ రెండు స్థానాలకు అభ్యర్థులు ఖరారు

పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం

ఒకటి రెడ్డి సామాజిక వర్గానికి.. మరొకటి బీసీలకు

సూత్రప్రాయంగా నిర్ణయం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే ఏడాది మార్చిలో రెండు పట్టభద్రుల స్థానాలు ఖాళీ కానున్నాయి. వాటికి సంబంధించి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది ఎన్నికల సంఘం. కొత్త ఓటర్ల చేర్పులు, పాత ఓటర్లకు సంబంధించి ఫారం 18 సమర్పణ వంటివి ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ పార్టీ ఆ రెండు స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించింది.

2లో



## ఏపీలో ఆ పార్టీదే జోరు!

- టిడిపి కూటమికి పెరిగిన ఓటు షేర్
- ఇప్పటికీ ఇప్పుడు ఎన్నికలు జరిగితే
- తెలుగుదేశానికి 46.9 ఓటు శాతం
- వైసీపీకి 35%
- జనసేనకు 9%, బిజెపికి మూడు శాతం
- చాణుక్య స్ట్రాటజీస్ సంస్థ సర్వేలో వెల్లడి

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. పట్టు పెంచుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా.. పుంజుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపి

- మిగతా 2వ పేజీలో

## రష్యా సైన్యంలో మనవారు!

అక్రమంగా వేలాదిమంది భారత యువత రిక్రూట్మెంట్

తెలంగాణలో వెలుగు చూసిన ఓ ముగ్గురి వ్యవహారం

ఉక్రెయిన్ తో సాగుతున్న యుద్ధభూమిలో బలిపీఠం

3లో





## కొత్త టీటీడీ చైర్మన్ ఎవరు?

నవంబర్ 7తో ముగియనున్న బీఆర్ నాయుడు పదవీకాలం

మరోసారి కొనసాగింపు లేనట్లే

ఆశావహుల జాబితాలో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కళా వెంకట్రావు ముందంజ

రఘురామ కృష్ణంరాజు, పిఠాపురం వర్మ సైతం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** టీటీడీ కొత్త చైర్మన్ ఎవరు? కొత్తగా ఎవరిని నియమిస్తారు? పొలిటికల్ వర్గాల్లో దీనిపై విస్తృత చర్చ నడుస్తోంది. ప్రస్తుత చైర్మన్ బి ఆర్ నాయుడు పదవీకాలం ముగిసింది. నవంబర్ 7తో ఆయన రెండేళ్ల పదవీకాలం పూర్తి కానుంది. అయితే ఆయనను కొనసాగిస్తారా?

- మిగతా 2వ పేజీలో

## జగన్‌ను వెంటాడుతున్న మంగళగిరి!

తరచూ నియోజకవర్గం లో ప్రయోగాలు

తాజాగా వైసీపీకి కొత్త ఇంచార్జ్ గా బుర్ర ముక్క వేణుగోపాల సోమిరెడ్డి

దొంతి వేమారెడ్డిని పక్కకు తప్పించిన వైనం

ఇటువైపుగా చూడని ఆళ్ల రామకృష్ణారెడ్డి

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** మంగళగిరి రాష్ట్రంలోనే ఇప్పుడు ప్రత్యేక నియోజకవర్గం.




- మిగతా 3వ పేజీలో

# కొత్త టీటీడీ చైర్మన్ ఎవరు?

కొత్తవారికి అవకాశం ఇస్తారా? అన్నది మాత్రం తెలియడం లేదు. అయితే ఆయన చుట్టూ రేగిన వివాదాల నేపథ్యంలో.. బి ఆర్ నాయుడు కొనసాగింపు ఉండే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. టీటీడీ చైర్మన్గా కొత్త నేతకు అవకాశాలు దక్కే పరిస్థితి కనిపిస్తోంది. అయితే రేసులో చాలామంది నేతలు ఉన్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి ఆధ్యాత్మిక భావాలు కలిగిన, రాజకీయ పార్టీలతో సంబంధం లేని వ్యక్తులకు పదవులు ఇస్తారని సమాచారం.

**అలా బిఆర్ నాయుడు వైపు మొగ్గు..**

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ చైర్మన్ పదవి భర్తీ జరగలేదు. దాదాపు మూడు నెలల పాటు జాప్యం జరిగింది. 2024 నవంబర్లో బి ఆర్ నాయుడుకు ఆ బాధ్యతలు కట్టబెట్టారు. అప్పట్లో మెగా బ్రదర్ నాగబాబుకు టీటీడీ చైర్మన్ పోస్ట్ ఇస్తారని అంతా భావించారు. అయితే ఆయనకు రాజ్యసభ పై ఇష్టం ఉండేది. ఆ సమీకరణల్లో ఛాన్స్ దక్కకపోవడంతో మంత్రిని చేస్తానని చెప్పారు చంద్రబాబు. అందుకు తగ్గట్టుగానే నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి దక్కింది. అటు తరువాత రకరకాల పేర్లు వినిపించాయి టీటీడీ చైర్మన్ పోస్ట్ కోసం. కానీ చివరకు టీవీ5 అధినేత బిఆర్ నాయుడు వైపు మొగ్గు చూపారు చంద్రబాబు. ఆయన నియామకం తర్వాత అనేక రకాల వివాదాలు నడిచాయి. అందుకే ఇప్పుడు బిఆర్ నాయుడుకు మరోసారి రెన్యువల్ దక్కే ఛాన్స్ లేదు.

**ప్రశాంతి రెడ్డికి ఛాన్స్..**

టీటీడీ చైర్మన్ పోస్ట్ కోసం చాలామంది పేర్లు బయటకు వచ్చాయి. ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు చెందిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఈసారి అవకాశం ఉంటుందని తెలుస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో టిడిపి కూటమి విజయం కోసం వేమిరెడ్డి కుటుంబం అహర్నిశలు శ్రమించింది. ప్రశాంతి రెడ్డి కోవూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు ఎంపీగా విజయం సాధించారు. అయితే ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఆశించారు. కానీ వివిధ సమీకరణలో దక్కలేదు. అందుకే ఈసారి టీటీడీ చైర్మన్ పదవి కోరుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టీటీడీ సలహా మండలి సభ్యురాలిగా ఆమె పనిచేశారు. ఆ అనుభవంతోనే టీటీడీ చైర్మన్ గా అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

**బీసీలకు ఇస్తే..**

మరోవైపు టీటీడీ చైర్మన్ పోస్టు ఈసారి వెనుకబడిన తరగతులు వారికి ఇస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తెలుగుదేశం పార్టీ కీలక ప్రకటన చేసింది. ఈ క్రమంలో ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి కళా వెంకట్రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. చీపురుపల్లి నుంచి గెలిచిన ఆయన మంత్రి పదవి ఆశించారు. కానీ వివిధ సమీకరణలో భాగంగా ఆ అవకాశం దక్కలేదు. అందుకే ఈసారి టీటీడీ చైర్మన్ పోస్ట్ ఇచ్చి రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పేరు కూడా వినిపిస్తోంది. పిఠాపురం వర్మ సైతం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. చాలామంది ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

**ఆధ్యాత్మికవేత్తలకు అవకాశం..**

అయితే ఈసారి టీటీడీ చైర్మన్గా రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఎందుకంటే రాజకీయ నేతలు చైర్మన్ పోస్టుల్లో ఉంటే అనేక రకాల వివాదాలు వెంటాడుతున్నాయి. అదే ఆధ్యాత్మికవేత్తకు అవకాశం ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం కూడా ఉంది. ఆర్ఎస్ఎస్ వర్గాలు సైతం ఇదే సూచన చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పదవి కోసం రాజకీయ పార్టీల నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వారి ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# రేవంత్ మరో బాంబు!



(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇప్పుడు మరో బాంబు పేల్చారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల లో పర్యటించిన సందర్భంగా సంచలన ప్రకటనలు చేశారు. కేటీఆర్ ను లక్ష్యంగా చేసుకొని రేవంత్ చేసిన ఆరోపణలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇన్నాళ్లు కేవలం జన్వాడ ఫామ్ హౌస్, విల్లాల చుట్టూనే సాగిన ఆస్తుల వివాదాన్ని సీఎం రేవంత్ మరింత ముందుకు తీసుకెళ్లారు.

**సంచలన ప్రకటనలు..**

సిరిసిల్లలో సీఎం రేవంత్ సంచలన ప్రకటన చేశారు. మరోసారి కేటీఆర్ ను టార్గెట్ చేసుకున్నారు. ఐటీ కారిడార్ లోని లగ్జరీ స్టార్ హోటల్ వ్యాపారం వైపు మళ్ళించారు. కేటీఆర్ కుటుంబానికి హైదరాబాద్ ఐటీ కారిడార్ లోనే కాకుండా ప్రధాన ప్రాంతాల్లో దక్కన్ సెరాయి పేరుతో పలు స్టార్ హోటళ్లు, సర్వీసు అపార్ట్మెంట్లు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. మైండ్ స్పేస్ వద్ద 100 అడుగుల స్టార్ హోటల్, కొండాపూర్ లో 120 గదుల లగ్జరీ ప్రాపర్టీ తో పాటు అట్ హోమ్ హాస్పిటాలిటీ పేరుతో భారీ నెట్వర్క్ నడుస్తోందని బహిరంగంగా ప్రకటించారు. పొలిటికల్ వర్గాల్లో ఇది అలజడి రేపుతోంది. అయితే రేవంత్ రెడ్డి యధాలపంగా చెప్పిన మాటలు ఇవి కావు. పక్క ఆధారాలతో పాటు రికార్డులను చేతిలో పెట్టుకొని ఈ ఆరోపణలు బయటపెట్టారు. ఇన్ని రోజులు తన తండ్రికి, తనకు కనీసం ఇల్లు కూడా లేదని చెప్పుకొచ్చారు కేటీఆర్. వాటినే సెటైరికల్ గా తిప్పి కొట్టిన రేవంత్ హైటెక్ సిటీ పక్కనున్న ఆ స్టార్ హోటళ్లు, బిజినెస్ ఎస్టేట్లు నీవి కాదని ప్రమాణం చేయగలవా? నీ ఆస్తులపై వైట్ పేపర్ విడుదల చేసే ధైర్యం ఉందా? వన్ టూ సవాల్ విసిరారు. ఆ ఆస్తులు కేటీఆర్ కుటుంబానివేనని నిరూపిస్తానని... లేకపోతే తన పేరు మార్చుకుంటానంటూ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు రేవంత్ రెడ్డి.

**అనుమానాలకు బలం..**

వాస్తవానికి గులాబీ పార్టీ హయాంలోనే ఐటీ కారిడార్ లోని దక్కన్ సెరాయి హోటల్స్, లగ్జరీ సర్వీస్ ప్రాపర్టీలు బాగా విస్తరించాయి. వాటి వెనుక కేసీఆర్ కుటుంబానికి చెందిన కీలక ముసుగు సంస్థలు ఉన్నట్టు స్పష్టమవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు సాధించిన పొలిటికల్ ప్రాబల్యాన్ని, ఐటీ కారిడార్ లోని ల్యాండ్ కేటాయింపులను ఈ హోటల్ నెట్వర్క్ విస్తరణకు వాడుకున్నారని అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. రేవంత్ రెడ్డి అత్యంత విశ్వసనీయ సమాచారంతోనే ఈ విషయాన్ని సిరిసిల్ల సభ వేదికగా ఎండగట్టగలిగారు. సీఎం రేవంత్ విసిరిన వైట్ పేపర్ సవాల్ తో పూర్తిగా డిఫెన్స్ లో పడిపోయారు కేటీఆర్. ఇప్పటివరకు సోషల్ మీడియా వేదికగా సెటైరికల్ గా మాట్లాడే వారు కేటీఆర్. కానీ గ్రౌండ్ లెవెల్ లోకి వెళ్లి సీఎం రేవంత్ బయట పెడుతున్న ఈ విషయాలు తెలంగాణ పొలిటికల్ వర్గాలపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. ప్రధానంగా కేటీఆర్ డిఫెన్స్ లో పడుతున్నారు.

## ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా

# విజయా రెడ్డి!



హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. అయితే గత ఎన్నికల్లో గులాబీ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు దానం నాగేందర్. త్రిముఖ పోటీలో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలవగా.. బిజెపి మూడో స్థానంలో నిలిచింది. ఆ రెండు పార్టీలు భారీగా ఓట్లు చీల్చడంతో సునాయాసంగా గెలుపొందారు దానం నాగేందర్. అయితే మరోసారి ఉప ఎన్నికల్లో దానం నాగేందర్ ను బరిలో దించుతారా? లేదా? అనేది సందేహమే. ఈ తరుణంలో పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తానే బరిలో దిగుతానని ప్రకటించారు. కేవలం దానం నాగేందర్ ఎంపీ టికెట్ కోసమే పార్టీ మారారని.. ఈసారి ఆయనకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. సహజంగానే ఇది దానం నాగేందర్ శిబిరంలో ఆందోళన కలిగించే విషయమే.

**నాగేందర్ అసంతృప్తి..**

ఇటీవల హైకోర్టు అనర్హత వేటు వేయగా దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ ఫలితం లేకపోయింది. ఆయనపై ఉన్న అనర్హత వేటు 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ విషయంలో అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారంలో ఉంది. కచ్చితంగా పోటీలో ఉంటానని.. ఏ పార్టీ తరపున అనేది స్పష్టత ఇవ్వలేదు నాగేందర్. ఇటువంటి సమయంలో గత ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయా రెడ్డి సంచలన ప్రకటన చేశారు. కచ్చితంగా తాను పోటీ చేస్తానని.. నిత్యం ప్రజల మధ్య ఉండడంతో తనకు ప్రజా మద్దతు ఉందంటూ చెప్పుకొచ్చారు. అయితే విజయా రెడ్డికి పార్టీ హై కమాండ్ హామీ ఇచ్చిందా? దానం నాగేందర్ డ్రాప్ అవుతారా? ఆయనను ఎమ్మెల్సీగా సరిపెట్టి మంత్రివర్గంలోకి తీసుకుంటారా? అనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**త్రిముఖ పోటీలో..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ లో త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున విజయా రెడ్డి, భారత రాష్ట్ర సమితి తరపున దానం నాగేందర్, బిజెపి తరఫున చింతల రామచంద్రారెడ్డి పోటీ చేశారు. దానం నాగేందర్ కు 67368 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి విజయా రెడ్డికి 45358, చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. అయితే ఇప్పుడు ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరడమే కాదు.. ఎంపీగా పోటీ చేశారు దానం నాగేందర్. ఆయన మూలంగానే ఇప్పుడు ఖైరతాబాద్ ఉప ఎన్నిక వచ్చింది. అయితే గతంలో కూడా ఇదే మాదిరిగా ఉప ఎన్నికలను ఎదుర్కొన్నారు దానం నాగేందర్. కానీ ఓటమి ఎదురయింది. మరోసారి ఆ పరిస్థితి తప్పేలా లేదు. అందుకే దానం నాగేందర్ ను తప్పించి.. గత ఎన్నికల్లో పోటీ చేసిన విజయా రెడ్డి వైపు కాంగ్రెస్ మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఖైరతాబాద్ నియోజకవర్గంలో నుంచి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించారు పి.జనార్దన్ రెడ్డి. ఆయనకు మంచి పేరు కూడా ఉంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అధినాయకత్వం విజయా రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరి అందులో ఎంత నిజం ఉందో చూడాలి.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ పై బీఆర్ఎస్ ఫోకస్!

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి సైతం తమ అభ్యర్థుల విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయిన కెసిఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల బరిలోకి.. వరంగల్ -ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని.. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్నగర్ స్థానానికి బీసీ అభ్యర్థిని బరిలో దింపాలని గులాబీ నాయకత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్ - నల్గొండ- ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి అనుగుల రాకేష్ రెడ్డి అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. అయితే ఆయన ఎప్పటికీ ఎన్నికల కార్యాచరణ మొదలుపెట్టినట్లు కూడా తెలుస్తోంది. గతంలో రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ఉన్నారు. మరోవైపు హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్నగర్ స్థానం కోసం బీసీ అభ్యర్థిని రంగంలోకి దించనుంది గులాబీ పార్టీ. ప్రధానంగా కాసాని మీరే ముదిరాజ్, నాగేందర్ గౌడ్, రవీందర్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పట్టభద్రుల నమోదు కార్యక్రమం కూడా మొదలుపెట్టింది ఆ పార్టీ. వికారాబాద్ కు చెందిన మాజీ కార్పొరేషన్ చైర్మన్ నాగేందర్ గౌడ్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టే విధంగా.. సామాజిక సమీకరణలను పెద్దపీట వేస్తూ అభ్యర్థులను ఖరారు చేయనుంది.

# సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

**తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్**

**65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి**

**ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి**

**సర్ ప్రక్రియను పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ**

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

# ఏపీలో ఆ పార్టీదే జోరు!

టిడిపి టిడిపి తో సమన్వయం కొనసాగిస్తోంది. ఇటువంటి తరుణంలో తాజాగా ఓ సర్వే ఒకటి వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎవరి బలం ఎలా ఉంది? అనే అంశాలపై చాణక్య స్ట్రాటజీస్ తాజా సర్వే నిర్వహించింది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో నిర్వహించిన ఈ సర్వేలో ప్రజాభిప్రాయం, ఓటర్ల అభిప్రాయాలు, స్థానిక రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల పనితీరు వంటి అంశాలను అధ్యయనం చేసినట్లు సదరు సంస్థ తెలిపింది. పార్టీల వారీగా ఓట్ల శాతం వివరాలను కూడా స్పష్టంగా వెల్లడించింది చాణక్య స్ట్రాటజీ.

**కూటమికి తిరుగులేదు..**

ప్రస్తుతం ఈ సర్వే ప్రకారం రాష్ట్రంలో కూటమి తిరుగులేని ఆధిక్యతతో ముందు వరసలో ఉంది. తెలుగుదేశం పార్టీ 46.9% ఓట్లతో ముందంజలో ఉంది. వైసిపి 35%, జనసేన 9%, బిజెపికి 3.5%, ఓటు షేర్ నమోదు చేసినట్లు నివేదిక వెల్లడించింది.. మొత్తం 52,000 మంది పై నిర్వహించిన సర్వే ఫలితాల ఆధారంగా లెక్కించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం, ఉద్యోగాల కల్పన, అన్నదాత సుఖీభవ, జాబ్ క్యాలెండర్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి అంశాలను సర్వే నివేదిక ప్రస్తావించింది.

**తగ్గిన వైసీపీ బలం..**



తాజా సర్వే ప్రకారం రాష్ట్రంలో టిడిపి కూటమి తిరుగులేని విజయం సాధిస్తుంది అనేది స్పష్టం అయ్యింది. 2024 ఎన్నికలతో పోల్చితే తెలుగుదేశం పార్టీ బలం పెరిగింది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గింది. జనసేన బలం స్వల్పంగా పెరిగింది. మూడు పార్టీలు కలిసి ఉమ్మడిగా మరోసారి వెళ్లనుండడంతో రాష్ట్రంలో తిరుగులేని విజయం ఖాయం అని అర్థం అవుతోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఈ సర్వే రావడం.. కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉందని తేలడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

**ఎమ్మెల్యేలు, ఎంపీలపై అసంతృప్తి**

రాష్ట్రస్థాయిలో చంద్రబాబు పాలనపై ప్రజల్లో నమ్మకం కొనసాగుతోందని ఈ సర్వే తేల్చింది. కానీ క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలపై వ్యతిరేకత కనిపిస్తోంది ఈ సర్వేలో. కొందరు ప్రజాప్రతినిధులపై అవినీతి, ఇసుక, మట్టి, ఇతర వ్యవహారాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నట్టు తేలింది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తుండడం పై ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఒక రకమైన అనుకూల వాతావరణం కూడా కనిపిస్తోంది. మరోవైపు రాయలసీమలోని కడప, కర్నూలులో మాత్రం వైసీపీ స్వల్పంగా బలపడిందని ఈ సర్వే తేల్చింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు ర్యాంకింగ్స్ కూడా ఇచ్చింది ఈ సర్వే సంస్థ. రాష్ట్రస్థాయి జాబితాలో మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ మొదటి స్థానంలో ఉన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా మూడో స్థానంలో నిలిచారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు నాలుగో స్థానంలో నిలవడం విశేషం. మొత్తానికి అయితే స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట విడుదలైన ఈ సర్వే సంచలనం సృష్టిస్తోంది.



# కాంగ్రెస్ వ్యవస్థల రాజకీయం!

(మొదటి పేజీ తరువాయి)

కానీ కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమి మాత్రం.. దశాబ్దాల కాలంనాటి పాత పద్ధతులు వైపు మళ్లాలని డిమాండ్ చేస్తోంది. పాత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించాలని.. ఆధునిక ఈవీఎంలను పక్కనపెట్టి.. మళ్లీ కాగితపు బ్యాలెట్ విధానానికే మొగ్గు చూపాలని కాంగ్రెస్ పట్టుపడుతోంది. అయితే ఇది రాజ్యాంగబద్ధ పోరాటంగా చెబుతోంది కానీ.. అందులో ఉండే డొల్లతనం బయటపెడుతోంది. భారతదేశంలో ఎన్నికల వ్యవస్థను ఆధునికరించే క్రమంలో ఈవీఎం సాంకేతికతను స్వయంగా ప్రవేశపెట్టింది కాంగ్రెస్. కానీ ఆ విషయాన్ని మరిచిపోయి మరి ఆ పార్టీ యూటర్న్ తీసుకొని ఈ వాదనను తీసుకురావడం సహేతుకం కాదు. తమ పార్టీ గెలిచినన్ని రోజులు అద్భుతంగా పనిచేసిన వ్యవస్థలు, వరుసగా అపజయాలు ఎదురవుతుండడంతో అకస్మాత్తుగా కుట్రలుగా మారిపోయాయని నమ్మించాలని భావిస్తోంది.

**సర్ ప్రక్రియను సైతం..**

ఓటర్ల జాబితా సమగ్ర ప్రక్షాళన చేస్తోంది ఎన్నికల సంఘం. దీనిని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కూటమి. దొంగ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను సరి చేయడం వల్ల వచ్చే సాంకేతిక సమస్యలు ఏంటో కాంగ్రెస్ స్పష్టంగా చెప్పలేకపోతోంది. నిజంగానే ఓటర్ల జాబితా ప్రక్షాళన వల్ల అర్హులైన పౌరులు ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉంటే.. సదరు బాధితులను నేరుగా ప్రజాక్షేత్రంలోకి తీసుకువచ్చి.. ఆధారాలతో సహా భారీ ధర్నాలు, ఆందోళనలు నిర్వహించే వెసులుబాటు ప్రతిపక్షాలకు ఉంది. ఓట్లు కోల్పోయిన అసలు వ్యక్తులు ఎవరో క్షేత్రస్థాయిలో చూపించకుండా.. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడం ప్రజల్లో విశ్వసనీయతను పెంచదు. కేవలం ఆరోపణలకే పరిమితమై.. పాత జాబితాలనే కొనసాగించాలని పట్టుబడడం వెనుక బోగస్ ఓట్లు కాపాడుకోవాలనే తాపత్రయమే ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**పాత ఓటర్ల జాబితాతోను ఓటమి..**

పాత ఓటర్ల జాబితాలు అమల్లో ఉన్న కాలంలోనే కాంగ్రెస్ పార్టీ వరుసగా ఓడిపోతూ వస్తోంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ మరిచిపోతోంది. ఒక వ్యవస్థ పరిపూర్ణంగా ఉన్నప్పుడే గెలుస్తాం.. లేకపోతే ఓడిపోతాం అనుకోవడం రాజకీయ పరిణితిని అనిపించుకోదు. ఓటమికి అసలు కారణమైన ప్రజాదరణ లేమిని, బలహీనమైన క్యాడర్ నిర్వహణను సమీక్షించుకోవడానికి బదులుగా.. ప్రతిసారి ఎన్నికల సాంకేతికతను, ఓటర్ల సవరణ ప్రక్రియను విలన్లుగా చిత్రీకరించడం ద్వారా తమ నైరస్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు తీర్పు ఇచ్చేది ఓటర్ల జాబితా పరిమాణాన్ని చూసి కాదు. పార్టీల నాయకత్వం పై ఉన్న నమ్మకాన్ని చూసి మాత్రమే నన్న నిజమైన సత్యాన్ని కాంగ్రెస్ గుర్తించలేకపోతోంది.



# బిజెపిపై జగన్ యుద్ధం!

కానీ తెర వెనుక మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చింది. కేంద్రానికి సంబంధించి కీలక బిల్లుల విషయంలో తమ మద్దతును బాహటంగానే ప్రకటించింది. గత రెండు సంవత్సరాలుగా కూడా తమ పరిమిత బలంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడింది. అయితే గతం మాదిరిగా కేంద్ర బీజేపీ నుంచి జగన్మోహన్ రెడ్డికి సరైన సహకారం లభించడం లేదు. ఆపై అదే బిజెపితో జత కట్టిన చంద్రబాబుకు కేంద్ర పెద్దలు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. మరోసారి కూటమి గాని ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇటువంటి సమయంలో జగన్మోహన్ రెడ్డి ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పదు. ఆయన ఇప్పుడు ఇండియా కూటమికి దగ్గరవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా ఎన్నికల సంఘంపై ఇండియా కూటమి యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో.. ఆ కూటమి చేపట్టబోయే నిరసనల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాల్గొబోతున్నట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది.

**సేవ్ డెమోక్రసీ ఉద్యమానికి మద్దతు..**

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తూ.. సేవ్ డెమోక్రసీ ఉద్యమం చేపడుతున్న సంగతి తెలిసిందే. జాతీయస్థాయిలో ఇది సంచలనంగా మారుతోంది. అయితే ఈ కూటమి నిరసనల్లో వైయస్సార్సీపి పాల్గొనే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల ఫలితాల అనంతరం జగన్మోహన్ రెడ్డి తన ఓటమికి ఈవీఎంల ట్యాంపరింగ్ ప్రధాన కారణం అంటూ వాదిస్తూ వచ్చారు. ఇటీవల ఈసీ తీరును, ఓట్ల లెక్కింపు ప్రక్రియను తప్పుపడుతూ రాహుల్ గాంధీతో సహా విపక్ష నేతలు లేవనెత్తిన అనుమానాలకు పరోక్షంగా మద్దతు పలికారు. సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు. ఈ ఉద్యమానికి బాసటగా వైసీపీ నిలుస్తుందన్న సంకేతాలను పంపించారు.

**ఒకరకంగా సంకట పరిస్థితి..**

అయితే ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంకట పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవేళ ఇండియా కూటమి ఆందోళన కార్యక్రమాలకు హాజరు కాకుంటే.. ఇన్ని రోజులు ఈవీఎంల వల్ల ఓడిపోయామన్నమాట గాలిలో కొట్టుకుపోతుంది. ఒకవేళ ఇండియా కూటమితో కలిసి పోరాటం చేస్తే రాజకీయంగా సరికొత్త కోణాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అయితే చాలాసార్లు ఈవీఎంల పనితీరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి అభ్యంతరాలు, ఫిర్యాదులు చేసింది వైసిపి. అందుకే ఇప్పుడు తప్పకుండా వైసిపి ఆ నిరసనకు మద్దతు తెలపాలి. మరోవైపు సందిగ్ధ స్థితిలో ఉన్న జగన్మోహన్ రెడ్డిని తమ వైపు తిప్పుకునేందుకు జాతీయ విపక్షాలు కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పుడు గాని జగన్మోహన్ రెడ్డి ఇండియా కూటమి వైపు వెళ్లక పోతే భవిష్యత్తులో ఒంటరి కావడం ఖాయం.

**న్యాయ చిక్కుముడులు తప్పవా..**

తాజా పరిస్థితులు చూస్తుంటే మాత్రం జగన్మోహన్ రెడ్డి రాజకీయ, న్యాయపరమైన చిక్కుముడుల్లో చిక్కుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఐదేళ్ల పాలనలో కేంద్రంలోని బిజెపి నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వానికి వైఎస్ఆర్సిపి దాదాపు అన్ని బిల్లులు, విధానపరమైన నిర్ణయాల్లో మద్దతు ఇచ్చింది. అయితే ఇప్పుడు ఇండియా కూటమి వైపు అడుగులు వేస్తే మాత్రం బిజెపి అగ్రనాయకత్వంతో ఉన్న చివరి సంబంధాలు కూడా పూర్తిగా పెంచుకున్నట్లు అవుతుంది. ప్రస్తుతం సీబీఐతో పాటు ఈడీ కేసులు కొనసాగుతున్న తరుణంలో జగన్మోహన్ రెడ్డి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అడుగులు వేయరు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# రష్యా సైన్యంలో మనవారు!

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** రష్యా సైన్యంలో వేలాది మంది భారతీయ యువత ఉన్నారా? చాలా వ్యూహాత్మకంగా రష్యా భారత యువతను ఆకర్షించిందా? యుద్ధ పీఠంపై భారత యువతను రష్యా నిలబెట్టిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఉక్రెయిన్ తో సాగుతున్న సుదీర్ఘ యుద్ధం రష్యా మానవ వనరుల సామర్థ్యాన్ని దెబ్బతీసింది. యుద్ధ క్షేత్రంలో వేలాదిమంది రష్యన్ సైనికులు ప్రాణాలు కోల్పోవడం, భారీగా క్షతగాత్రులు కావడం వల్ల క్రెమ్లిన్ కు సైనిక కొరత ఏర్పడింది. దేశీయంగా నిరసనలు వెలువెత్తకుండా ఉండేందుకు రష్యా ప్రభుత్వం ఇతర దేశాల యువతపై కన్నేసింది. ఆర్మీ హెల్పర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సపోర్టు స్టాఫ్ పేర్లతో దక్షిణాసియా దేశాలైన భారత్, నేపాల్, శ్రీలంక ల నుంచి యువకులను రిక్రూట్ చేసుకునే నెట్వర్క్ ను పుతిన్ యంత్రాంగం వేగవంతం చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన ముగ్గురు, నలుగురు యువకుల వ్యవహారం వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. దేశవ్యాప్తంగా వందలాది, వేలాదిమంది భారతీయ యువకులు.. ఇప్పటికే రష్యా సైన్యంలో కాంట్రాక్టు సైనికులుగా చేరి ఉక్రెయిన్ సరిహద్దుల్లో చిక్కుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**అత్యంత వ్యూహాత్మకంగా..**

అత్యంత వ్యూహాత్మకంగా భారతీయ యువతను తన సైన్యంలో చేర్చింది రష్యా. ఈ రిక్రూట్మెంట్ వెనుక అత్యంత పకడ్బందీగా పనిచేస్తున్న బ్రోకర్ల దందా, నిరుద్యోగ సమస్య ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. మోసపూరిత ఏజెంట్లు భారతదేశంలోని నిరుద్యోగ యువతను ఆకర్షించేందుకు నెలకు లక్షల్లో జీతాలు, ఏడాదికి 50 నుంచి 60 లక్షల రూపాయల వరకు ప్యాకేజీలు, రష్యన్ పౌరసత్వం లభిస్తుందని నమ్మబలుకుతున్నారు. కేవలం క్యాంపుల్లో పర్యవేక్షణ, సైనిక సహాయకులుగా మాత్రమే పనిచేయాలని మొదట్లో చెబుతున్నారు. తరువాత యుద్ధ కాంట్రాక్టులు చిక్కుకుంటున్నారు. అసలు ఈ కాంట్రాక్టుల తీవ్రత ఏంటి? ఆధునిక యుద్ధక్షేత్రంలో డ్రోన్లు, క్షిపణుల వర్షం మధ్య ఎంతటి ప్రాణాపాయం ఉంటుందనేది వారు గ్రహించలేకపోతున్నారు. విదేశీ గడ్డపై డాలర్ల సంపాదన, కుటుంబ పేదరికం పోతుందన్న ఆశతో భారతీయ యువకులు ఈ మృతి మార్గంలోకి వెళు_న్నారు.

**అక్కడకు వెళ్లిన తరువాత..**

### భారత ప్రభుత్వానికి సవాల్..

రష్యా సైనిక రిక్రూట్మెంట్ ఇప్పుడు భారత దౌత్య వర్గాలకు విదేశాంగ మంత్రిత్వ శాఖకు పెను సవాల్ గా మారింది. భారత ప్రభుత్వం రష్యాపై దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చి.. పలువురిని డిశ్చార్జ్ చేయించి వెనక్కి తీసుకొచ్చింది. అయితే చట్టబద్ధంగా రష్యన్ ఆర్మీతో కాంట్రాక్టు కుదుర్చుకున్న వారిని వెనక్కి రప్పించడం, అంతర్జాతీయ న్యాయపరంగా సంక్లిష్టంగా మారింది. దీనికి తోడు భారత్ లో ఉన్న అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా నెట్వర్కు ఇప్పటికీ దుబాయ్, బ్యాంకాక్ లేదా సెంట్రల్ ఆసియా దేశాల మీదుగా యువకులను మాస్కోకు చేరవేస్తూనే ఉన్నాయి. అయితే అటువంటి ట్రావెల్ ఏజెన్సీలపై దాడులు జరుగుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న నిరుద్యోగం, అత్యాశను ఆసరాగా చేసుకుని ఈ చీకటి వ్యాపారం సాగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిఘా వ్యవస్థలను మరింత కట్టుదిట్టం చేసి.. ఇలాంటి రిక్రూట్మెంట్లు జరగకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

వివిధ మార్గాల్లో భారతీయ యువతను ఆకర్షిస్తుండగా.. వారు రష్యాలోకి అడుగుపెట్టిన తరువాత కథ పూర్తిగా మారిపోతోంది. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ పై సంతకం చేయించుకోగానే.. ఆ యువకులకు రోస్టోవ్ లేదా ఇతర శిక్షణ శిబిరాల్లో కేవలం 15 నుంచి 20 రోజులపాటు ప్రాథమిక ఆయుధ శిక్షణ ఇస్తున్నారు. భాష రాకపోవడం, కఠినమైన మైనస్ డిగ్రీల చలి వాతావరణం, సరైన రక్షణ కవచాలు లేకపోవడం వంటి పరిస్థితుల్లో.. వారిని నేరుగా ఫ్రంట్ లైన్ బఫర్, బాంబుల దాడి జరిగే మొదటి వరుస సైనిక దళాల తరహాలో నిలబెడుతున్నారు. మధునాతన ఉక్రెయిన్ డ్రోన్ దాడులు, క్లస్టర్ బాంబుల దాడుల నుంచి తప్పించుకునే కనీస యుద్ధ నైపుణ్యాలు లేని అమాయక విదేశీ యువకులు క్షణాల వ్యాధులు మృత్యువాత పడుతున్నారు.

# జగన్‌ను వెంటాడుతున్న మంగళగిరి!

టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అది. మొన్నటి ఎన్నికల్లో 90 వేలకు పైగా ఓట్లతో ఆ నియోజకవర్గంలో నుంచి గెలిచారు లోకేష్. మొన్నటి ఎన్నికల వరకు ఒక ఎత్తు. తరువాత మరో ఎత్తు అన్నట్టు ఆ నియోజకవర్గంలో పరిస్థితి ఉంది. ఇప్పుడు అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రం అవకాశం లేదు. అంతలా బలం పెంచుకున్నారు లోకేష్. ఎన్నికల్లో గెలిచాక, మంత్రి అయిన తర్వాత మంగళగిరి నియోజకవర్గ స్వరూపాన్ని మార్చేస్తున్నారు. చంద్రబాబుకు కుప్పం, జగన్మోహన్ రెడ్డికి పులివెందుల మాదిరిగా.. తనకు కంచు కోటలా మలుచుకున్నారు. అయితే ఇప్పుడు జగన్ ఆ కంచుకోట ను బద్దలు కొట్టాలని నిర్ణయించారు. బలమైన నేతను రంగంలోకి దించాలని భావిస్తున్నారు.

**అత్యంత కీలక నియోజకవర్గం..**

గుంటూరు జిల్లాలో అమరావతి రాజధాని పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళగిరి ఒకటి. ఇక్కడ నుంచి వైసీపీ తరపున రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. 2014లో తొలిసారిగా గెలిచారు. 2019లో రెండోసారి కూడా ఏకంగా మంత్రిగా ఉన్న నారా లోకేష్ పై గెలిచి ఆకట్టుకున్నారు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం జగన్ ఆళ్ల రామకృష్ణారెడ్డిని పక్కన పెట్టేశారు. సామాజిక సమీకరణలకు పెద్దపీట వేస్తూ ఓ బీసీ మహిళా నేతకు టికెట్ ఇచ్చారు జగన్. కానీ లోకేష్ భారీ మెజారిటీతో గెలిచారు. మంత్రి అయ్యారు. ఇప్పుడు మంగళగిరి అంటేనే వైసీపీ నేతల భయపడే పరిస్థితికి వచ్చింది.

**రియల్ ఎస్టేట్ వ్యాపారి..**

మరోవైపు మంగళగిరి విషయంలో అనేక ప్రయోగాలు చేస్తున్నారు జగన్.



తాజాగా ఆ నియోజకవర్గానికి కొత్త ఇన్చార్జిగా బుర్ర ముక్క వేణుగోపాల సోమిరెడ్డిని నియమించారు. ఆయన మంగళగిరి పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. మంచి ఆర్థిక బ్యాక్గ్రౌండ్ ఉండడంతోనే జగన్ ఆయన వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు నియోజకవర్గ బాధ్యతలు చూసిన దొంతినేని వేమారెడ్డిని పక్కన పెట్టారు జగన్. అయితే మొన్నటి ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే మురుగుడు కుటుంబం నుంచి ఒకరు బరిలో దిగగా.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆ కుటుంబం పూర్తిగా వైసిపికి దూరంగా ఉంటుంది. మరోవైపు గతంలో లోకేష్ ను ఓడించిన ఆళ్ళ రామకృష్ణారెడ్డి ఈ నియోజకవర్గంలో చూడడం లేదు.

**ఎన్నికల ఖర్చు పెట్టే నేత..**

లోకేష్ బలంగా పునాదులు వేసుకోవడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంగళగిరిలో అంత ఆశలు లేవు. అందుకే అక్కడ బలమైన అభ్యర్థుల కంటే ఆర్థికంగా బలమైన నేతల వైపే జగన్ మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. రాజకీయంగా పెద్దగా పరిచయం లేని, ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని వ్యక్తికి నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడం విశేషం. గతంలో వైసీపీలో పని చేసిన అనేక కుటుంబాలు జగన్ వైఖరి నచ్చక రాజకీయాల నుంచి దూరమయ్యాయి. అయితే లోకేష్ ను దృష్టిలో పెట్టుకొని మంగళగిరి విషయంలో జగన్ తెగ ప్రయోగాలు చేస్తుండడం మాత్రం విశేషం.










## శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నవ రత్రోత్సవముల కరపత్రాల ఆవిష్కరణ

**క్రైమ్ మిర్రర్, సశీస్థాన్ నారాయణపురం:-** శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 26 తేదీ వరకు శ్రీ దుర్గాదేవి శరన్నవ రత్రోత్సవములు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామీజీ మాట్లాడుతూ శ్రీ దుర్గాదేవి శరన్నవ రత్రోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శ్రీ దుర్గాదేవి శరన్నవ రత్రోత్సవములులకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ శంకరనంద స్వామీజీ, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, గుండెబోయిన రమేష్ యాదవ్, కొండ శ్రీకాంత్ గౌడ్,ఉప్పల నాగరాజు,కొండ రవి,మేకల వెంకటేష్,టంగుటూరి ప్రవీణ్,శికిలమెట్ల శేశికాంత్,జనగాం సత్తిష్,గవ్వల నాగరాజు,బొల్లోజు సందీప్ కుమార్, ఎర్రోళ్ల సందీప్, ముత్యాల సాయి,వనమోని గోపాల్,విరమళ్ళ నరసింహ,మల్లేపల్లి వెంకట్ రెడ్డి,మాడపాటి సత్తిష్, బండమీది నరేష్, జోకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వి జి పి పి - జలసిరి వి బి జిఆర్ ఏ ఎం జి పనులను సద్వినియోగించుకోండి

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వి జి పి పి-జలసిరి వి బి జి ఆర్ ఏ ఎం జి పనుల ప్రణాళికపై స్థానిక సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు వారి ఆధ్వర్యంలో శుక్రవారం 02-10-2026ఉదయం 10:00 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించబడును. గాంధీ జయంతి సందర్భంగా వి జి పి పి-జలసిరి వి బి జిఆర్ ఏ ఎం జి పనుల ప్రణాళికపై ప్రత్యేక గ్రామసభ లో ఇట్టి గ్రామ సభలో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, రైతులు తమ పొలంలో, వరద కట్టలు, ఫారం పాండ్ , చెక్ డాం, పశువుల పాకలు, డ్రై ఫ్లాట్ ఫామ్ కల్లాలు, హార్టికల్చర్ మునగా, బత్తాయి మొదలగు పనులకు దరఖాస్తు చేసుకోగలరు గ్రామ సభకు ప్రతి ఒకరు హాజరై పైన తెలిపినటువంటి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందుటకు సంబంధిత పత్రాలు అనగా ఆధార్ కార్డ్, జాబ్ కార్డ్, బ్యాంకు బుక్, పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ తీసుకు రాగలరు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నార్సింగి పరిధిలో యువకుడి దారుణ హత్య




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కోకాపేట నియోపోలీస్ ప్రాంతంలోని కురుమ సంఘం భవనం సమీపంలో యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కూడా ఘటనాస్థలాన్ని పరిశీలించి పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడిని ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలానికి చెందిన వెంకన్నగా గుర్తించారు. క్రికెట్ బ్యాట్‌తో తలపై బలంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాత్రి సమయంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. వెంకన్న హైదరాబాద్‌లోని ఉస్మానియా క్యాంపస్‌లో ఉంటూ పీహెచ్‌డీ చేస్తున్నట్లు తెలిసింది. అదే సమయంలో వడ్డీ వ్యాపారం కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం. కోకాపేటలోని ఓ పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. హత్య సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. వెంకన్నను ఎవరు హత్య చేశారు? హత్యకు అసలు కారణం ఏమిటి? ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారమా? లేక వ్యక్తిగత కారణాలతో హత్య జరిగిందా? అనే కోణాల్లో నార్సింగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఇంద్రేశం రాయల్ ఎన్ఆర్ఐ సిటీ పార్క్ స్థలానికి ఎసరు

**అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఏదీ?**

**పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు ఆపాలి**

**మున్సిపల్ కమిషనర్ కు రాయల్ ఎన్ఆర్ఐ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**

**మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని స్థలాన్ని కాపాడాలని అసోసియేషన్ డిమాండ్**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 01:** ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని రాయల్ ఎన్ఆర్ఐ సిటీ కాలనీలో పార్కు, పబ్లిక్ ఓపెన్ స్పేస్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ.. రాయల్ ఎన్ఆర్ఐ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. కాలనీకి సంబంధించిన సర్వే నంబర్లు 164, 166, 167, 168, 169, 170, 171, 172, 173లో పార్కు కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు.ఆమోదిత లేఅవుట్‌లో పార్కు స్థలం స్పష్టంగా చూపించినప్పటికీ, కొందరు వ్యక్తులు సరైన హక్కు పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు లేకుండా ఆ స్థలాన్ని విక్రయిస్తూ శాశ్వత నిర్మాణ పనులు చేపడుతున్నారని అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. పార్కు స్థలం ఉంటుందనే నమ్మకంతోనే కాలనీలో ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక కౌన్సిలర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. లేఅవుట్ ప్లాన్, మున్సిపల్ రికార్డులను పరిశీలించి పార్కు స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని, స్థలాన్ని కబ్జాల నుంచి పరిరక్షించి పార్కుగా అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ మేరకు ఆమోదిత లేఅవుట్ మ్యాప్, నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలు, అసోసియేషన్ రిజిస్ట్రేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు మనోహర్ వైస్ ప్రెసిడెంట్, ప్రకాష్ కోశాధికారి, కిన్నెర రవి సలహాదారుడు, నవాజ్ రెడ్డి ఎక్సకుటివ్ మెంబెర్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.

# రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

## విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ముందు బీజేపీ ధర్నా





**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సంస్థాన్ నారాయణపురం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి, అనంతరం భారీ ర్యాలీగా విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం, సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరువీరారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుతం రైతులకు సరిపడా విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. కేవలం ఆరు, ఏడు గంటల విద్యుత్ సరఫరాతో పంటలు చేతికొచ్చే సమయంలో పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం వద్ద సుమారు మూడు గంటల పాటు నిరసన కొనసాగించారు. కార్యాలయంలో అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు కదిలేది లేదని బీజేపీ శ్రేణులు అక్కడే బైఠాయించారు. కొద్దిసేపు అర్ధనగ్న ప్రదర్శన కూడా నిర్వహించి నిరసన తెలిపారు.

ఈ క్రమంలో విద్యుత్ శాఖ ఏఈడీ బీజేపీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడి, రేపటి నుంచి రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటామని, అందుకు తనదే బాధ్యత అని హామీ ఇచ్చారు. దీంతో బీజేపీ నాయకులు తమ నిరసన కార్యక్రమాన్ని విరమించారు.రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి,జిల్లా కార్యవర్గ సభ్యులు వంగరి రఘు, భాస్కర నరసింహా గౌడ్,జిల్లా నాయకులు జక్కర్తి బిక్షపతి, ఆత్కూరి రాములు,తంగేళ్ల సత్తయ్య,మాజీ సర్పంచ్,గడ్డం స్వామి,మండల ఉపాధ్యక్షులు కట్కూరి లక్ష్మీ వెంకటేష్ గౌడ్, సుర్వి వెంకటేష్ గౌడ్,మండల కార్యదర్శి కోడూరు బీరయ్య, జక్కర్తి నరసింహ, యువమోర్చా మండల అధ్యక్షుడు గిరిబాబు గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కుకుడాల మహేందర్ రెడ్డి,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నెల్లికంటి శ్రీశైలం యాదవ్,దళిత మోర్చా మండల అధ్యక్షుడు బోడ అనిల్ కుమార్,గొర్ల కాపరుల సెల్ మండల కన్వీనర్ నర్రీ నరసింహ,గీతా సెల్ మండల కన్వీనర్ చెరుకు కిషన్ గౌడ్, చేనేత సెల్ మండల కన్వీనర్, గూడెల్లి బాలరాజు,వావిల్లపల్లి ఉపసర్పంచ్ మెరుగు సైదులు, భూసా శీను,గూడూరు ఇంద్రసేనారెడ్డి,బద్దం యాదయ్య గౌడ్, వీరమల్ల జంగయ్య గౌడ్,మొగుదాల స్వామి గౌడ్,సుర్వి కుమార్ గౌడ్ సుర్వి వెంకటేష్ గౌడ్ బూత్ అధ్యక్ష కార్యదర్శులు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

**ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడాలి**

**సిపిఐ, అఖిలపక్షపార్టీల డిమాండ్**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తూ, భారత ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలని ప్రత్యామ్నాయ పౌర సమూహం, అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. స్థానిక మంచికంటి ఫంక్షన్ హాల్ లో సిపిఐ ప్రతినిధి ఐవీ రమణారావు అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.ముందుగా సిపిఐ ప్రతినిధి రవిమారుత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా ఉండే ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసే పద్ధతిలో జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలి ఉందని ఆరోపించారు. ఒక రాజకీయ పార్టీకి ఉద్దేశ్యపూర్వకంగా మేలు కలిగించే పద్ధతిలో ఆయన పని తీరు ఉంటోందని, ఆ విషయాన్ని ఒక ప్రధాన వార్తా పత్రిక కథనం బుజువు చేసిందని విమర్శించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం సైతం లోపభూయిష్టంగా ఉందనే ఆరోపణలు కూడా వచ్చాయని,13కోట్ల మంది ఓటున కోల్పోయారని ఆవేదన చెందారు. రాజ్యాంగం, ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు సంబంధం లేకుండా ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇతర ఎన్నికల సంఘం కమీషనర్ లను సంప్రదించకుండానే,సమాచారం అందించకుండానే జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలు తీసుకుంటున్నాడని విమర్శించారు.ఇందంతా ప్రతిపక్షపార్టీల బలాబలాలపై, గెలుపోటముల పై తీవ్రమైన ప్రభావం చూపుతోందని అన్నారు. దీని వలన ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటోందని ఆవేదన చెందారు. అందుకే ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్న ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని ఆయన కోరారు. ఈ విషయంపైన ప్రజలను

చైతన్యం చేసేందుకు సిపిఐ అక్టోబర్ 2వ తేదీ నుండి 6వ తేదీ వరకు ప్రచార నిరసన కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా నగరంలోని ఆరు కేంద్రాలలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 3, 4, 5 తేదీలలో

డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, వివిధ జన సమూహాలలో కరపత్రాల పంపిణీ, నగరవ్యాప్తంగా మైక్ ప్రచారం చేయనున్నామని తెలిపారు. చివరగా అక్టోబర్ 6వ తేదీ ఉదయం 10:00 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలలో ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ సిపిఐ చేస్తున్న ప్రచార నిరసనోద్యమాలకు తమ మద్దతును ప్రకటించారు. తాము భాగస్వాములం అవుతామని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, బీ ఆర్ యస్, సిపిఐ, సీపీఐ(యం), సిపిఐ(యంయల్ మాస్ లైన్), సీపీఐ(యంయల్ న్యూడెమొక్రసీ), ప్రతినిధులు నాగండ్ల దీపక్ చౌదరి, తిరుమలరావు, సింగు నర్సింహారావు, నున్నా నాగేశ్వరరావు, పుల్లయ్య,మధు, సీసీఏ ప్రతినిధులు డా.రవీంద్రనాథ్, కాకి భాస్కర్, మనోహర్ రాజు, కాకి భాస్కర్, చిత్రా రవి, విజయ్, బందారు రమేష్ వివిధ రాజకీయ విద్యార్థి సంఘాల ప్రతినిధులు హాజరైనారు.

# ఓబీసీ కులగణన సాధనకై మైలార్‌దేవ్‌పల్లిలో సన్నాహక సమావేశం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాబోయే 4వ తేదీన జరగనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లిలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ 4వ తేదీన జరగబోయే ఓబీసీ కులగణన సాధన సభను రాజేంద్రనగర్ నియోజకవర్గం తరపున విజయవంతం చేయడంపై స్థానిక నాయకులు తరలిరావాలన్నారు. ఈ భారీ బహిరంగ సభకు నియోజకవర్గంలోని బీసీ ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీసీ సంఘం ప్రతినిధులు, రాజేంద్రనగర్ నియోజకవర్గం వివిధ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### అంతమ్మగూడెం, దోతిగూడెం కెమికల్ పరిశ్రమలను

# వెంటనే మూసివేయాలి

**కెమికల్ పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి తగిన నష్టపరిహారం చెల్లించాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ డిమాండ్**




**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బూర్య:-** పోచంపల్లి మండలం పరిధిలోని అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో కొనసాగుతున్న కెమికల్ పరిశ్రమల వల్ల స్థానిక ప్రజలు, రైతాంగం తీవ్ర నష్టాన్ని , అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆ పరిశ్రమలను ప్రభుత్వం వెంటనే మూసివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెమికల్ పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణం నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని సూచించారు. గురువారం పోచంపల్లి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో ఉన్న కెమికల్ పరిశ్రమలను ఎత్తివేయాలని, పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలల నుండి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు 11 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించుకుంటూ ఆర్డిఓ కార్యాలయం ముందు నిర్వహించిన మహాధర్నకు ముఖ్యఅతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ ఈ కెమికల్ పరిశ్రమల నుండి వెలువడుతున్న విషపూరిత రసాయనాలు, పొగ, వ్యర్థాల కారణంగా వాయు, నీటి కాలుష్యం కోరలు చాచిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం వల్ల వ్యవసాయ భూములు, పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పండించిన పంటలు కూడా విషతుల్యంగా మారుతున్నాయని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ, చేతివృత్తులపై ఆధారపడిన వృత్తిదారులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వదిలే వాయువుల్లో 12 రకాల ప్రమాదకరమైన రసాయనాలు గాలిలో కలుస్తున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సి.పి.సి.బి.) అధికారులు గుర్తించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కాలుష్య గాలిని పీల్చడం వల్ల స్థానిక ప్రజలు క్యాన్సర్, చర్మవ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం, కిడ్నీ సమస్యలు వంటి అనేక ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారని మండిపడ్డారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో స్థానికులకు అవకాశం కల్పించకపోవడం, నష్టపోతున్న రైతులను గుర్తించకపోవడం దారుణమన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న ఈ కెమికల్ పరిశ్రమలను తక్షణమే ఇక్కడి నుండి తరలించాలని, అలాగే కాలుష్యం వల్ల నష్టపోయిన రైతాంగానికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమల కాలుష్యం వల్ల పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. 2019 నాటి కమిటీ సూచనల ప్రకారం సంవత్సరానికి ఎకరానికి రూ. 52,000 చొప్పున తక్షణమే చెల్లించాలి. అలాగే, పరిశ్రమల యాజమాన్యాలు కలెక్టర్ కార్యాలయంలో 2021లో జమ చేసిన రూ. 23 లక్షల పంట నష్టపరిహారాన్ని వెంటనే రైతులకు పంపిణీ చేయాలి డిమాండ్ చేసినారు. కాలుష్యం కారణంగా పడావు పడ్డ అన్ని వ్యవసాయ భూములకు పంట నష్టపరిహారం అందజేయాలని, పంటలు, భూములు, భూసారం, నీటి వనరులు, ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి న్యాయమైన పరిహారం అందించాలని అన్నారు. పొల్యూషన్, రైతుల నష్టాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో గ్రామ రైతులకు, ప్రజలకు అవకాశం కల్పించాలని, ప్రజా అభిప్రాయాలను సేకరణ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నష్టపోయిన రైతులను గుర్తించడం కోసం వెంటనే రీ-సర్వే చేపట్టాలి. కాలుష్య ప్రభావిత భూములు, పంటలు, నీటి వనరులు, జీవనోపాధి నష్టాలను సమగ్రంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన పెద్ద ఎత్తున కొనసాగిస్తా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ మాట్లాడుతూ పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని డిమాండ్ చేసినారు. పరిశ్రమల వల్ల కలుషితమైన భూగర్భ జలాలు, చెరువులు, బోరుబావులు, ఇతర నీటి వనరులను శాస్త్రీయంగా పరీక్షించి, నివారణ చర్యలు చేపట్టాలి. పరిశ్రమల నుండి వెలువడే విషపూరిత వాయువులు, పొగ, రసాయన వ్యర్థాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ కాలుష్యాన్ని నియంత్రించాలని అన్నారు. అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని గుర్తించేందుకు సమగ్ర ఆరోగ్య సర్వే చేపట్టాలని, కాలుష్యం వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు కోల్పోతున్న జీవనోపాధిపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి, వారికి తగిన నష్టపరిహారం, పునరావాస సహాయం అందించాలి సూచించారు. గ్రామ ప్రజల, రైతుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, కాలుష్య సమస్యపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో గ్రామ ప్రజలు, రైతు సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, పరిశ్రమల నుండి వెలువడే పొల్యూషన్ అంచనా వేయడానికి పొల్యూషన్ తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో గారికి డిమాండ్లతో కూడిన మెమొరండాన్ని అందించగా వారు ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ 15 రోజులలోపు రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపడతామని, రైతులకు జరుగుతున్న నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి రీసర్వే చేయిస్తామని, మిగతా సమస్యలపై జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులతో చర్చించి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శివర్గ సభ్యులు సిపిఎం ప్రసాదం విష్ణు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, చౌటుప్పల పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గడ్డం వెంకటేష్, రాయగీర్ కిష్టయ్య, సిపిఎం పోచంపల్లి మండల కార్యదర్శివర్గ సభ్యులు పగిల్ల లింగారెడ్డి, మంచాల మధు చౌటుప్పల్ మండలం కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి చింతల సుదర్శన్, సీపీఎం నాయకులు బండారు నరసింహ, ఆదిమూలం నందీశ్వర్ పొట్ట శ్రీనివాస్ బోధస్ వెంకటేష్ కొండే శ్రీశైలం కొంతం సుశీల శ్రీనివాస్ రెడ్డి కాసం వెంకటేశం నేరేడు మహేష్, చీరిక అలివేలు, బత్తుల దాసు పకీరు పెంటా రెడ్డి పకీరు లక్ష్మమ్మ చెరుకు సత్తయ్య అంజయ్య, , సామ జంగారెడ్డి, కల్మూరి బిక్షపతి, నెల్లికంటి జంగయ్య, వడ్డేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, రైతులు జి. దామోదర్ రెడ్డి, కే మహేష్, ఆర్ రామిరెడ్డి, ఆర్ ధనలక్ష్మి, వీ రేణుక, జి. రామచంద్రారెడ్డి, ఎం సత్తయ్య, సత్యం, అర్జున్ రెడ్డి, జి మల్లేష్, బి బిక్షపతి, మల్లారెడ్డి, ఎల్లమ్మ, రాకేష్, శ్రీశైలం తో పాటు స్థానిక గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఏర్పాట్లు పూర్తి

**విజేతలకు అందించే మెడల్స్, బహుమతులు ఆవిష్కరించిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 01:** సంగారెడ్డి పట్టణంలోని చౌహాన్ ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 2న నిర్వహించనున్న ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు అందజేయనున్న మెడల్స్, బహుమతులను గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆవిష్కరించారు.క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కిక్ బాక్సింగ్ ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎండీ సాజిద్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిపిఓ ల కృతజ్ఞత సభకు జగ్గారెడ్డికి ఆహ్వానం



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 01:** గ్రామ పాలన అధికారులుగా నియమితులై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి లో నిర్వహించనున్న కృతజ్ఞత సభకు హాజరు కావాల్సిందిగా జిపిఓ ల సంఘం నాయకులు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని ఆహ్వానించారు. గురువారం ఐబీ గెస్ట్‌హౌస్‌లో జగ్గారెడ్డిని కలిసి సభకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో వీఆర్వో వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తిరిగి తమ స్వంత శాఖల్లోకి వచ్చామని జిపిఓ లు జగ్గారెడ్డికి వివరించారు. గ్రామ పాలన అధికారులుగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిపిఓ లకు జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఓ ల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం 18వ డివిజన్‌లో టౌన్ ప్లానింగ్ సమస్యల పరిష్కారంపై సమీక్ష సమావేశం

**ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం సుడా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు.గత నెల ఖమ్మం నగరంలోని 18వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు చైర్మన్ పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లపై ర్యాంపుల ఏర్పాటు రహదారులకు సంబంధించిన ఇబ్బందులు ఇతర టౌన్ ప్లానింగ్ సమస్యలను స్థానికులు వివరించారు.ఈ సమస్యలపై అప్పట్లోనే స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ నేపథ్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో 18వ డివిజన్‌లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు పూర్తయిన పనులు ఇంకా పరిష్కరించాల్సిన అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై ర్యాంపులు తదితర టౌన్ ప్లానింగ్ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ప్రజల నుంచి వచ్చే సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని చైర్మన్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో మాజీ కార్పొరేటర్ మండడపు లక్ష్మీ మనోహర్ టౌన్ ప్లానింగ్ డీసీపీ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు టీపీబీఓలు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ యం.ఎల్.సి ఏఐవైఎఫ్ ఓటరు నమోదు కేంద్రాని సద్వినియోగం చేసుకోండి




ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మామిండ్ల.శ్రీనాథ్ రెడ్డి, చింతల.రమేష్ పిలుపు.

**ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్ యం.ఎల్.సి ఓటు నమోదు కేంద్రలు ప్రారంభం**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం,నల్గొండ,వరంగల్ గ్రాడ్యుయేట్ యం.ఎల్.సి ఓటరు నమోదు కేంద్రాని ఏర్పాటు చేయడం జరిగిందని గ్రాడ్యువేట్స్ అందరూ సద్వినియోగం చేసుకోగలరని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మామిండ్ల.శ్రీనాథ్ రెడ్డి,చింతల.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఖమ్మం జిల్లా కేంద్రంలోని యన్.ఎస్.టి రోడ్డులోని సరిత క్లినిక్ సెంటర్ లోని ఉదయ్ నెట్ సెంటర్ లో, ప్రకాష్ నగర్ లోని కమిషనరేట్ ఎదురుగా తాజ్ నెట్ సెంటర్ లలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ యం.ఎల్.సి ఓటర్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐవైఎఫ్ ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ యం.ఎల్.సి ఓటర్ నమోదుకు సరిత క్లినిక్ సెంటర్ లోని ఉదయ్ కుమార్ నెట్ వర్క్ వాట్స్ అప్ నెంబర్, అలాగే ఖమ్మంలోని ప్రకాష్ నగర్ లోని కమిషనరేట్ ఎదురుగా తాజ్ నెట్ సెంటర్ వాట్స్ అప్ నెంబర్ లకు వాట్స్ అప్ లో ఓటు నమోదుకు కావలసిన సర్టిఫికెట్స్ ను వాట్స్ అప్ లలో పంపిస్తే ఓటు నమోదు చేసి పంపిస్తామని వారు తెలిపారు.ఈ సెంటర్స్ కి సహకారంగా ఏఐవైఎఫ్ ఖమ్మం నగర అధ్యక్ష,కార్యదర్శులు దుర్గనాథ్, కృష్ణ ప్రసాద్ ల నెంబర్స్ లకు సంప్రదించగలరని కోరారు.ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం,నల్గొండ,వరంగల్ గ్రాడ్యుయేట్ యం.ఎల్.సి ఓటరు నమోదు కేంద్రాని ఏర్పాటు చేయడం జరిగిందని గ్రాడ్యువేట్స్ అందరూ సద్వినియోగం చేసుకోగలరని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు.శ్రావణ్,నగర అధ్యక్ష,కార్యదర్శులు దుర్గనాథ్, కృష్ణ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు బొప్పి.ఉమా,జిల్లా నాయకులు అశోక్, హేమంత్,ఉదయ్,నవీన్,నరేష్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## వి జి పి పి - జలసిరి వి బి జిఆర్ ఏ ఎం జి పనులను సద్వినియోగం చేసుకోండి

**వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు**



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వి జి పి పి-జలసిరి వి బి జి ఆర్ ఏ ఎం జి పనుల ప్రణాళికపై స్థానిక సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు వారి ఆధ్వర్యంలో శుక్రవారం 02-10-2026ఉదయం 10:00 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించబడును. గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వి జి పి పి-జలసిరి వి బి జిఆర్ ఏ ఎం జి పనుల ప్రణాళికపై ప్రత్యేక గ్రామసభలో ప్రత్యేకంగా ఉపాధి హామీ పథకం ద్వారా ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, రైతులు తమ పొలంలో, వరద కట్టలు, ఫారం పాండ్ , చెక్ డాం, పశువుల పాకలు, డ్రై ఫ్లాట్ ఫామ్ కల్లాలు, హార్టికల్చర్ మునగా, బత్తాయి మొదలగు పనులకు దరఖాస్తు చేసుకోగలరు గ్రామ సభకు ప్రతి ఒకరు హాజరై పైన తెలిపినటువంటి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందుటకు సంబంధిత పత్రాలు ఆధార్ కార్డ్, జాబ్ కార్డ్, బ్యాంకు బుక్, పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ తీసుకు రాగలరు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శుక్రవారం 2-10-2026

# హైదరాబాద్‌లో ఏఎస్ఎంఈ ఇండియా తెలంగాణ ప్రొఫెషనల్ సెక్షన్ ప్రారంభం

## ఇంజినీరింగ్ రంగంలో జ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అనుసంధానానికి వేదిక

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ) ఇండియా తెలంగాణ ప్రొఫెషనల్ సెక్షన్‌ను హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ ప్రీమియర్‌లో అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణలో ఇంజినీరింగ్ రంగానికి చెందిన నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల మధ్య సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, వృత్తిపరమైన అభివృద్ధిని మరింత బలోపేతం చేయడం ఈ కొత్త ప్రొఫెషనల్ సెక్షన్ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ రంగాలకు చెందిన నిపుణులతో పాటు ప్రముఖ విద్యాసంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జ్ఞాన మార్పిడి, సాంకేతిక ఆవిష్కరణలు, నెట్‌వర్కింగ్, పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. టెక్ మహీంద్రా, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ , టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, హ్యుందాయ్ మోటార్, హనీవెల్ ఏరోస్పేస్, సీమెన్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితర ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంజిఐటి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.



చంద్రమోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డితో పాటు ఎంజిఐటి, వాసవి ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. బిఐటిఎస్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్, ఐఐటీ ఖరగ్‌పూర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఎన్ఐటి వరంగల్, విఎన్ఆర్ విజెఐఇటి తదితర విద్యాసంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన విద్యాసంస్థల ప్రతినిధులు, ఇంజినీరింగ్ నిపుణులు పాల్గొని కొత్త ప్రొఫెషనల్ సెక్షన్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఏఎస్ఎంఈ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్, బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ ఆపరేషన్స్ విభాగాల డిప్యూటీ డైరెక్టర్ హరి బాలచంద్రన్ మాట్లాడుతూ తెలంగాణ ఇంజినీరింగ్, ఆవిష్కరణలు, ఆధునిక పరిశ్రమలకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని అన్నారు. కొత్త ప్రొఫెషనల్ సెక్షన్ ద్వారా ఇంజినీరింగ్ నిపుణుల మధ్య సహకారం, నైపుణ్యాభివృద్ధి, నిరంతర అభ్యసనం, నాయకత్వ వికాసం, పరిశ్రమలతో అనుసంధానాన్ని మరింత ప్రోత్సహించే అవకాశం ఉంటుందని వివరించారు.



# శంషాబాద్ జోన్‌లో వీధి కుక్కల నియంత్రణకు డాగ్ క్యాచింగ్ వాహనాలు ప్రారంభం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ జోన్‌లో వీధి కుక్కల సమస్యను నియంత్రించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శంషాబాద్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ కె. చంద్రకళ డాగ్ క్యాచింగ్ వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. జోన్ పరిధిలో వీధి కుక్కల సంఖ్య, వాటి వల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డాగ్ క్యాచింగ్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధి కుక్కల నియంత్రణ చర్యలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శంషాబాద్ జోన్ పరిధిలోని ప్రజలు తమ ప్రాంతాల్లో వీధి కుక్కలకు సంబంధించిన సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే 040-21111111 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేయాలని అధికారులు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో శంషాబాద్ జోన్‌ను మరింత పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# మణికొండలో అంగన్‌వాడీ టీచర్లకు ఘన సన్మానం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ పరిధిలోని 127వ డివిజన్‌లో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. సరస్వతి, బాలలక్ష్మి, ప్రణీతలను శాలువాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల సంరక్షణ, పోషకాహారం, ప్రాథమిక విద్యతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలో వివిధ వర్గాలకు సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు సీహెచ్. ఇందిరా, మాజీ కౌన్సిలర్ వందన నాగేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జొన్నాడ సిద్ధప్ప, మణికొండ డివిజన్ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. వినోద్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ చిలుకూరి బీరప్ప, రఘు, సతీష్ కుమార్, రాజశేఖర్, రామ్‌చందర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌డీజీ ప్రైమ్ స్కూల్ బస్సు బీభత్సం..

## ఒక మహిళ మృతి.. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపణలు

**కోదాడ అక్టోబర్ 01 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ పరిధిలో ఎస్ఆర్‌డీజీ ప్రైమ్ స్కూల్‌కు చెందిన బస్సు బీభత్సం సృష్టించింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వాహనం నడపడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.స్కూల్ బస్సుల నిర్వహణ, డ్రైవర్లకు శిక్షణ, వేగ నియంత్రణ, విద్యార్థుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనపై స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరగా, మృతుడి కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



# తరంగజ్యోతి లెర్నింగ్ సెంటర్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ 25 కంప్యూటర్ల విరాళం

## సీఎస్ఆర్‌లో భాగంగా కంప్యూటర్ల అందజేత

### అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా కంప్యూటర్ సెంటర్ ప్రారంభం

గండిపేట(క్రైమ్ మిర్రర్): ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలోని అమెనిటీస్ బ్లాక్‌లో నిర్వహిస్తున్న తరంగజ్యోతి లెర్నింగ్ సెంటర్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 25 కంప్యూటర్లను అందజేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ నేషనల్ హెడ్ రజనీష్ ఖన్నా, స్టేట్ హెడ్ కె.వి.రంగాచారి ఆధ్వర్యంలోని ప్రతినిధుల బందం ఈ కంప్యూటర్లను అకాడమీకి అందజేసింది. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాడమీ సిబ్బంది పిల్లలలో నైపుణ్యాభివద్ధి, వివిధ సబ్జెక్టుల్లో మెరుగైన పరిజ్ఞానం పెంపొందించేందుకు తరంగజ్యోతి లెర్నింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంప్యూటర్ శిక్షణకు అవసరమైన 25 కంప్యూటర్లను ఐసీఐసీఐ బ్యాంక్ సిఎస్ఆర్ ద్వారా అందించడం అభినందనీయమన్నారు. ప్రజాసేవలో పని చేస్తున్న పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఒక ప్రై వేట్ బాఆ్యంక్ ఇంత పెద్ద ఎత్తున సిఎస్ఆర్ సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. తరంగజ్యోతి లెర్నింగ్ సెంటర్ ద్వారా సంవత్సరానికి సుమారు 3 వేల మంది వరకు ఇంగ్లీష్, మ్యాథ్స్, కంప్యూటర్ శిక్షణతో పాటు ఆర్ట్స్





అండ్ క్రాఫ్ట్స్, యోగా తదితర అంశాల్లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. పోలీసు సిబ్బంది పిల్లలకు చిన్నారి క్రెచ్ సేవలు అకాడమీలో పని చేసే సిబ్బందికి డ్యూటీ సమయంలో వారి చిన్నారులను సంరక్షితంగా ఉంచేందుకు చిన్నారి క్రెచ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు తమ విధులకు హాజరయ్యే సమయంలో పిల్లలను క్రెచ్‌లో వదిలి విధులకు వెళ్లేందుకు ఈ సంక్షేమ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ నేషనల్ హెడ్ రాకేష్ ఖన్నా మాట్లాడుతూ, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ప్రజల భద్రత, సంక్షేమం కోసం నిరంతరం సేవలందిస్తున్నాయని అన్నారు. సైబర్ క్రైమ్ ప్రివెన్షన్‌పై ఐసీఐసీఐ బ్యాంక్ తరఫున శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అలాగే వృద్ధుల నిర్వహణ వంటి రంగాల్లోనూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.తెలంగాణ పోలీస్ అకాడమీ వంటి ప్రతిష్టాత్మక సంస్థకు సిఎస్ఆర్‌ద్వారా సేవ చేసే అవకాశం లభించడం తమకు గర్వకారణమని రజనీష్ ఖన్నా అన్నారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు మురళీధర్, ఎన్.వెంకటేశ్వర్లు, కెఆర్‌కె ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాస్‌రెడ్డి, వేముల శ్రీనివాసరావు, నరహరి, డిఎస్‌పిలు పి.జి.రెడ్డి, సతీష్, ఆదూరి శ్రీనివాసరావు, సందీప్‌రెడ్డి, సోమనారాయణసింగ్, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినధులు, తరంగజ్యోతి కోర్స్ కోఆర్డినేటర్ ఆర్ఐ కృష్ణ, చిన్నారి ఇన్‌చార్జీ ఆర్ఐ మహేష్, క్వార్టర్ మాస్టర్ శ్రీనివాస్, ఇతర ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

# భరత్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమం

## పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ..తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలి

### డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

**కూకట్ పల్లి, అక్టోబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో గురువారం ఉదయం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.



మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొని పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ శంకర్, నిరంజన్ తదితరులు పాల్గొని కాలనీలో పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడటంతో పాటు, కాలనీలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాలకు అందించాలని సూచించారు. చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పడవేయకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి మాట్లాడుతూ, కాలనీ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. కాలనీలో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి నరేష్ కుమార్, రత్నారావు, మధు, వెంకటేష్ యాదవ్, డేవిడ్, వెంకటేష్, శ్రీనివాస్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాలనీని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రాందేవ్ రావు ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

## రక్తదానం సామాజిక బాధ్యత...మరొకరి ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ

### విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాందేవ్ రావు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్ పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఒక నిండు ప్రాణాన్ని కాపాడి, వారికి పునర్జన్మ ప్రసాదించినట్లవుతుందని పేర్కొన్నారు. రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందక ప్రాణాపాయ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని, అలాంటి విపత్కర పరిస్థితుల్లో స్వచ్ఛంద రక్తదాతలు అందించే రక్తం ఎంతో విలువైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఆరోగ్యంగా ఉన్నవారు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించుకుని, మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు. రక్తదానం అనేది కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా, మరొకరి ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ అని ఆయన అభిప్రాయపడ్డారు. యువత రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజంలో సేవాభావాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ రక్తదాన శిబిరంలో అఖిల్, లక్ష్మీ ప్రసాద్, రాధాకృష్ణ, సందీప్, రాకేష్, భరత్, అనిల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 2-10-2026


# మందమర్రి ఏరియాకు 130 శాతం బొగ్గు ఉత్పత్తి

## రామకృష్ణాపూర్ ఓసిపిని త్వరలో ప్రారంభిస్తాం:జిఎం ఎన్.రాధాకృష్ణ




**మందమర్రి టౌన్ అక్టోబర్ 01 క్రైమ్ మిర్రర్:** మందమర్రి ఏరియా లో సెప్టెంబర్ నెలలో 130 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 105 శాతం మట్టి తొలగింపు లక్ష్యాన్ని పూర్తి చేసిందని,ఉత్పత్తి ఉత్పాదకత కార్మిక సంక్షేమ వివరాలను గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎన్.రాధాకృష్ణ విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ గనులలో ఉద్యోగుల గైర్హాజరు వలన ఉత్పత్తికి కొంత విఘాతం కలుగకుండ ఈ సమస్యను అధిగమించడానికి యూనియన్ నాయకులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.ఓసీపీలలో పేలుడు పదార్థాల పరిమాణం వాడే డిలే డెటోనేటర్ల సమయం ఆధారంగా పేలుడు యొక్క తీవ్రత సురక్షిత పరిమితుల్లోనే ఉండేలా మైనింగ్ ఇంజనీర్లు డిజైన్ చేస్తారని తెలిపారు.ప్రమాదాల నివారణ పేలుడు జరిపినప్పుడు రాళ్లు మట్టి ముక్కలు గాలిలోకి ఎగిరిపడకుండా తగిన విధంగా జాగ్రత్తలు తీసుకుంటారని ఈ పరిధి గరిష్టంగా 300 మీటర్ల లోపే పరిమితమయ్యేలా చర్యలు ఉంటాయని అన్నారు.గని కార్మికుల ప్రాణరక్షణే ప్రథమ కర్తవ్యం భూగర్భ గనుల్లో సురక్షిత బ్లాస్టింగ్ విధానాలు భూగర్భ గనుల్లో బొగ్గు, ఖనిజాల వెలికితీత కోసం నిర్వహించే బ్లాస్టింగ్ ప్రక్రియ అత్యంత సున్నితమైనది జాగ్రత్తతో కోరుకున్నదని అన్నారు.గనుల్లో పనిచేసే ఉద్యోగులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటిస్తూ బ్లాస్టింగ్ సిస్టమ్‌ను రూపొందిం చడం జరుగుతుందని పేర్కొన్నారు.అలాగే రక్షణతో కూడిన ఉత్పత్తితోపాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా సింగరేణి యాజమాన్యం ముందుంటుందని అన్నారు.ఈ సంవత్సరంలో మహిళలకు, యువతీ యువకులకు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటిషన్ కంప్యూటర్ శిక్షణ తరగతులు ఈనెల ప్రారంభించబోతున్నామని తెలిపారు.రామకృష్ణాపురం ఓసిపిని అతి త్వరలో ప్రారంభం కాబోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కేకే ఏజెంట్ ఖాదిర్, కేకేఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం, బాలాజీ భగవతి జ, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, సీనియర్ పిఓ కార్తీక్ తథా ఇతరులు పాల్గొన్నారు.

# నెక్నాంపూర్‌లో డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి పర్యటన

## మన వార్డు--మన సమస్యలులో రోడ్డు కనెక్టివిటీ, కమ్యూనిటీ హాల్‌పై చర్చ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నెక్నాంపూర్ డివిజన్‌లో 'మన వార్డు--మన సమస్యలు' కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ శ్రీ లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న పలు ప్రధాన సమస్యలను స్థానికులు, రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు జితేందర్ కూడా కార్యక్రమంలో పాల్గొని స్థానిక సమస్యలపై అధికారులతో చర్చించారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా డివిజన్‌లోని వివిధ ప్రాంతాలను అనుసంధానించే కనెక్టింగ్ రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భూసేకరణతో పాటు రోడ్డు నిర్మాణానికి ఎదురవుతున్న ఇతర అడ్డంకులను కూడా త్వరగా పరిష్కరించాలని కోరారు. హెచ్‌జీసీఎల్ రోడ్ నంబర్ 30 కనెక్టివిటీని మాస్టర్ ప్లాన్‌లో చేర్చినట్లు తెలిపారు. తదుపరి దశలో ఈ రోడ్డును నార్సింగి రోడ్డుతో అనుసంధానించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. నెక్నాంపూర్ చెరువు బండ్‌పై రోడ్డు నిర్మాణానికి హెచ్‌జీసీఎల్ ప్రతిపాదన చేసినట్లు



తెలిపారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే టౌన్‌షిప్‌లోని కొంతమేర ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రోడ్ నంబర్ 13 కనెక్టివిటీ కోసం రైతులతో ఇటీవల సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయని, భూసేకరణ అధికారుల ముందు రైతులు తమ అభిప్రాయాలు, షరతులను వెల్లడించినట్లు వివరించారు. అన్ని వర్గాలతో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించి రోడ్డు కనెక్టివిటీకి మార్గం సుగమం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నెక్నాంపూర్ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన అంశం ప్రస్తుతం హెచ్ఎండీఏ కమిషనర్ పరిశీలనలో ఉందని తెలిపారు. కమ్యూనిటీ హాల్‌కు అవసరమైన అమెనిటీస్ ల్యాండ్ కేటాయింపు జరగకపోవడంతో ఇది పాలసీకి సంబంధించిన అంశంగా మారిందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులను మరోసారి కలిసి చర్చించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు కోరారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో నెక్నాంపూర్ డివిజన్‌కు చెందిన పలువురు రెసిడెంట్స్, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొని తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈరోజు పర్యటన ప్రధానంగా అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని రోడ్లు, కనెక్టివిటీ, కమ్యూనిటీ హాల్ తదితర సమస్యలపైనే కేంద్రీకృతమైంది.



# సన్‌సిటీ ప్రాంతంలో విద్యార్థుల కోసం పీక్ అవర్స్‌లో బస్సుల సంఖ్య పెంచాలి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ పరిధిలోని సన్‌సిటీ పరిసర ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఉదయం స్కూల్, కాలేజీలకు వెళ్లే సమయాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక నాయకుడు హరీష్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో బస్సులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులు కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు బస్సుల్లో నిల్చొని, కొన్ని సార్లు బస్సు మెట్ల వద్ద కూడా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇది వారి భద్రతకు తీవ్రప్రమాదకంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ అధికారులు సన్‌సటీ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల రద్దీని దృష్టిలో ఉంచుకోని ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా, విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లలో ప్రత్యేకంగా అదనపు సర్వీసులు నడపడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచాలన్నారు. విద్యార్థులు సురక్షితంగా సౌకర్యవంతంగా తమ విద్యాసంస్థలకు చేరుకునేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల భద్రత, ప్రజారవాణా సౌకర్యం దృష్ట్యా ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మందమర్రి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా






**మందమర్రి టౌన్ అక్టోబర్ 01 క్రైమ్ మిర్రర్:** మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా గురువారం సందర్శించారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మందమర్రి ఎస్ఐ నరేష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్,స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచిం చారు. రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బంది బ్యారక్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు.స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన అంశాలతో పాటు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నమోదవుతున్న నేరాలు,పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు,నేర నియంత్రణ చర్యలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై స్టేషన్ ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని అన్ని విభాగాల పనితీరును సమీక్షించినట్లు తెలిపారు. రిసెప్షన్ కేంద్రం పనితీరు, పెట్రోల్ వాహనాల నిర్వహణ,పెండింగ్ కేసుల పురోగతి, వివిధ విభాగాల పనితీరు, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించినట్లు పేర్కొన్నారు. మందమర్రి సింగరేణి పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో ఇక్కడ ప్రత్యేకమైన సవాళ్లు ఉన్నాయని సీపీ తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే దొంగతనాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్టేషన్ అధికారులకు సూచించారు. గతంలో కేసులు నమోదైన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచుతూ వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అన్నారు. అవసరాన్ని బట్టి నిబంధనల ప్రకారం గ్యాంగ్ ఫైళ్లను ప్రారంభించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందమర్రి ప్రాంతం లో నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి నేర రహిత, మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పోలీస్ అధికారులకు సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు.ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీస్ సేవలు అందించేలా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ తెలియజేశారు.



# గడీల శ్రీకాంత్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన ఆదర్శ్ రెడ్డి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 01:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముత్తంగి అథర్వ ఫామ్‌స్టే కన్వెన్షన్ హాల్‌లో మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ తండ్రి గడీల కుమార్ గౌడ్ దశదినకర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పిఎస్ఆర్ గార్డెన్స్‌లో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్ తండ్రి గడీల ఈశ్వరయ్య గౌడ్ దశదినకర్మ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వట్టినాగులపల్లిలో గౌని చెరువుకు కొత్త బోర్

## బతుకమ్మ పండుగను దృష్టిలో పెట్టుకుని చర్యలు.. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చొరవ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగను దృష్టిలో పెట్టుకుని నార్సింగి సర్కిల్ పరిధి వట్టినాగులపల్లి గ్రామంలోని గౌని చెరువులో కొత్త బోర్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, సివైసి కమిషనర్ చొరవతో ఈ పనులు చేపట్టినట్లు స్థానిక నాయకులు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో భాగంగానే చెరువులో కొత్త బోర్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో పండుగ ఏర్పాట్లు, నీటి సౌకర్యాలపై కూడా దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొద్దు ధర్మపురి ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మైలారం ప్రదీప్ కుమార్, గండిపేట్ డివిజన్ అధ్యక్షుడు మన్నె నరేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు. వట్టినాగులపల్లి గ్రామ పెద్దలు దుల్చన్ శిపాల్ సింగ్, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గొల్ల నాగేష్ యాదవ్, ఉప సర్పంచ్ రాగం సురేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శేఖర్, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు చిగురు బాలరాజ్ ముదిరాజ్, సోమైల రాజు ముదిరాజ్, కుమ్మరి చంద్రయ్య, కొండే కృష్ణ యాదవ్, బుడాల దర్శన్ ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు. అలాగే మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బుడాల అరుణ్ కుమార్ ముదిరాజ్, మొద్దు సాయిరాం ముదిరాజ్, సోమైల ఆర్య ముదిరాజ్ తదితరులు పాల్గొని కొత్త బోర్ ఏర్పాటు పనులను పరిశీలించారు.

# ఎర్రబోడలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానం

## గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ డివిజన్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సప్నా రెడ్డి అధ్యక్షతన ఎర్రబోడలో సేవా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు గర్భధారణ సమయంలో అవసరమైన పోషక విలువలు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు కార్యక్రమంలో వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. వారి సేవలను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ హాజరయ్యారు. మహిళా మోర్చా నాయకురాలు వనితా రెడ్డి, పవన్ కుమార్, మల్లేష్ చారి, ఎల్. వెంకటేష్, షేక్ బాషా, బాలసాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు నూతన డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులను అధికారులు అందజేశారు. కార్డుల పంపిణీ కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి రామకృష్ణ, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ మహేష్, చెకింగ్ జీపీఓ కృష్ణవేణి పాల్గొని లబ్ధిదారులకు డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులతో రేషన్ సేవలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. పాత లామినేషన్ రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన ఆధునిక స్మార్ట్ కార్డులు అందుబాటులోకి



వస్తాయని పేర్కొన్నారు. రేషన్ పొందడం, ఆధార్ అనుసంధానం, ఈ-కేవైసీ వంటి ప్రక్రియలను సులభంగా నిర్వహించేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని వివరించారు. అలాగే రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందే పోర్టబిలిటీ సౌకర్యం కలుగుతుందని, నకిలీ రేషన్ కార్డులను గుర్తించి నియంత్రించేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. అత్తాపూర్ గ్రామానికి చెందిన రేషన్ కార్డు లబ్ధిదారులందరూ తమ ఆధార్ కార్డు, పాత రేషన్ కార్డుతో గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులను పొందాలని అధికారులు సూచించారు. కార్డుల పంపిణీని దశలవారీగా ప్రతి ప్రాంతం, ప్రతి కాలనీలో నిర్వహిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కార్డుల పంపిణీకి సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, స్థానిక రేషన్ డీలర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గంధంగూడలో అక్రమ లేఅవుట్ నిర్మాణాల కూల్చివేత



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ పరిధిలోని గంధంగూడ సర్వే నెంబర్ 38లో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ లేఅవుట్‌పై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో, పై అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్మిషన్లు ఇప్పిస్తాం, అధికారులతో మాట్లాడి పని పూర్తి చేయిస్తాం అని చెప్పే దళారులు, మధ్యవర్తుల మాటలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు అన్నారు. జీహెచ్‌ఎంసీ దళారీ వ్యవస్థను ఎంత మాత్రమూ సహించేది లేదన్నారు. ప్రభుత్వం ప్రపజల తక్షణ సౌకర్యార్థం బిల్డ్ నౌ వంటి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇల్లు కట్టుకోవాలనుకున్నా లేదా ఇతర నిర్మాణ పనులు చేపట్టాలనుకున్నా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చి అన్ని వివరాలు తెలుసుకుని నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని, చట్టభద్దమైన అనుమతులు ఉన్న వాటినే ఎంచుకోవాలని ప్రజలకు సూచించారు.

## రక్తదానం మరొకరి జీవితానికి ప్రాణదానం: జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్




**కూకట్ పల్లి, అక్టోబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం లో కూకట్ పల్లి లో రామ్ దేవ్ రావు హాస్పిటల్ సీఈఓ యోబు ఆహ్వానం మేరకు గురువారం వీకేఆర్ ట్రస్ట్ బ్లడ్ క్యాంపు కార్యాలయంలో జనసేన తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, స్వయంగా పాల్గొని రక్తదానం చేసిన యువకులను, జనసైనికులను అభినందించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ సమాజంలో అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ఈ రక్తదాన శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, గోపి కృష్ణ, వీర మహిళ శిరీష, హాస్పిటల్ మేనేజర్ కల్పన, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియామకం..

**పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా: తిరుమణి రవి గౌడ్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా తనను నియమించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తిరుమణి రవి గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, తల్లోజు ఆచారి అన్నకు, నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ నాయకులకు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షులు జెట్టి వెంకటేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా ఓబీసీ సమాజానికి, పార్టీకి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు రవి గౌడ్ పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నాయకుల మార్గదర్శకత్వంలో, కార్యకర్తల సహకారంతో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

# అలకాపూర్ టౌన్‌షిప్ సమస్యలపై డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డితో సమావేశం

**45 రోజుల్లో డ్రైనేజీ డైవర్షన్ పనులు.. రోడ్లు, పార్కులు, పారిశుధ్యంపై కీలక చర్చ**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో నెలకొన్న పలు మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏటీఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ని కలిసి సమస్యలను వివరించారు. టౌన్‌షిప్‌లోని రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిదీపాలు, పార్కులు, చెరువుల శుభ్రత తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రోడ్ నంబర్ 30లో డ్రైనేజీ డైవర్షన్ పనులను అత్యవసరంగా చేపట్టాలని ప్రతినిధులు కోరగా, డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఈ పనులను హై ప్రాధాన్యతతో చేపట్టి సుమారు 45 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఏటీఆర్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ తెలిపారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఇంకా నిర్మించాల్సిన రహదారులను అధికారులకు ప్రత్యక్షంగా చూపడంతో పాటు, ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలు, అధ్వాన రహదారి పరిస్థితిని కూడా వారి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ నంబర్ 4తో పాటు సాన్వి శాండ్‌ఫీల్డ్స్ అపార్ట్‌మెంట్స్ ముందు ఉన్న రహదారి, వారధి రోడ్డు అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. రోడ్ నంబర్ 4కు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, మిగిలిన రెండు రోడ్ల పనులను కూడా త్వరలో చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. అలాగే రోడ్ నంబర్ 13 నుంచి బీఆర్‌సీకి అనుసంధానించే రహదారిని ప్రారంభించడం, రహదారికి అడ్డుగా ఉన్న అనవసర నిర్మాణాలను తొలగించి రోడ్ నంబర్ 13ను బీఆర్‌సీ వరకు పొడిగించడం వంటి అంశాలను కూడా చర్చించారు. రోడ్ నంబర్ 17 నుంచి 19 వరకు ఉన్న కనెక్టివిటీ రోడ్డును అధికారులకు చూపించి, రోడ్ నంబర్ 19లో మిగిలి ఉన్న పనులతో పాటు తుల్జారాం ఆలయానికి వెళ్లే పూర్తి రహదారి అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని కోరారు. టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఇప్పటికే పరిరక్షించిన స్థలాన్ని కూడా డీసీకి చూపించారు. కమ్యూనిటీ హాల్ పనులను అత్యంత ప్రాధాన్యతతో వీలైనంత త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని డీసీ హామీ ఇచ్చినట్లు ఏటీఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు తెలిపారు. టౌన్‌షిప్‌లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, చెరువుల శుభ్రత, అన్ని ప్రాంతాల్లో వీధిదీపాల ఏర్పాటు, పార్కుల్లో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం వంటి అంశాలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న కుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు, దోమల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పార్కుల వినియోగ సమయాలను మరింత పొడిగించాలని ఏటీఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏటీఆర్‌డబ్ల్యూఏ జనరల్ సెక్రటరీ డెండి శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ చకిలం శ్రీధర్, అసిస్టెంట్ ట్రెజరర్ బి. ప్రదీప్ కుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మహేంద్ర చారి, కిషన్ మసూరం, పి. శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అబాకస్ పోటీలో చాణక్య అకాడమీ విద్యార్థుల ఘన విజయం

**విద్యార్థులు కనబరిచిన అద్భుత ప్రతిభ గర్వకారణం**

**టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్**




**కూకట్‌పల్లి, అక్టోబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** అంతర్జాతీయ అబాకస్ పోటీలో చాణక్య అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించడం ఎంతో గర్వకారణమని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అంతర్జాతీయ అబాకస్ పోటీలో విజయం సాధించిన చాణక్య అకాడమీ విద్యార్థులను బండి రమేష్ ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కేవలం 8 నిమిషాల్లో 200 గణిత సమస్యలను వేగంగా, ఖచ్చితంగా పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం విద్యార్థుల ఏకాగ్రత, పట్టుదల, ప్రతిభకు నిదర్శనమని అన్నారు. చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని, విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ట్రైనర్ల కృషి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ పోటీలో టి. లాలిన్, హరివంశ్ ప్రథమ బహుమతి, ఏ. శ్రీయాన్ష్, కే. జేష్విక ఐరా ద్వితీయ బహుమతులు సాధించారు. ట్రైనర్ చంద్రిక ఐనాపూడి మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ ఘన విజయాన్ని సాధించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం కూకట్‌పల్లి ప్రాంతానికి గర్వకారణమని, భవిష్యత్తులో కూడా వారు మరిన్ని విజయాలు సాధించి దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె శివ, శ్రీనివాస్, వాజిద్ పాషా, పులి శివకుమార్ గౌడ్, రామారావు, పాల్గొని విజేతలను అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్**

**కూకట్ పల్లి, అక్టోబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అనారోగ్య కారణంగా చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి" వి. జగదీశ్వర్ గౌడ్ నల్లగండ్ల లోని వారి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించినవారికి నియోజకవర్గంలోని 25 మందికి రూ. 14,95,000/- మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఆపద సమయంలో, బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ సహాయ నిధి సకాలంలో మద్దతు అందించడం ద్వారా కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా కాపాడుతుందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కి, ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సత్తూర్ శిరీష, నాయకులు, డివిజన్ నాయకులు, మహిళ నాయకులు, లేబర్ సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, యువకులు, లబ్ధిదారులు, ప్రజలు, టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు.

# వెటర్నరీ నూతన వాహనాలను ప్రారంభించిన జోనల్ కమిషనర్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ప్రజారోగ్యం, జంతు సంక్షేమం మరియు మున్సిపల్ నిబంధనల పక్కా అమలు దిశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోన్ పశువైద్య విభాగం ఆధ్వర్యంలో నూతనంగా సమకూర్చిన కుక్కల నియంత్రణ వాహనాలు మరియు వెటర్నరీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాలను శంషాబాద్ జోనల్ కమిషనర్ అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలు శంషాబాద్ జోన్ పరిధిలోని శంషాబాద్ సర్కిల్, జల్ పల్లి సర్కిల్, ఆదిబట్ల సర్కిల్ మరియు బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా సేవలు అందిస్తాయని పశువైద్య శాఖాధికారి వెల్లడించారు. నూతన ప్రత్యేక వాహనాల ద్వారా శంషాబాద్, జల్ పల్లి, ఆదిబట్ల మరియు బడంగ్ పేట్ సర్కిళ్లలో వీధి కుక్కలను సురక్షితంగా పట్టుకొని నిబంధనల ప్రకారం సంతాన నిరోధక శస్త్రచికిత్సలు మరియు రేబీస్ నిరోధక టీకాలు క్రమం తప్పకుండా అందించడంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాల సహాయంతో నాలుగు సర్కిళ్ల పరిధిలో అక్రమ మాంస విక్రయాలు, అనుమతి లేని కసాయిశాలలను అరికట్టడానికి నిరంతర తనిఖీలు నిర్వహించడం, రహదారులపై రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ ప్రమాదాలకు కారణమయ్యే సంచార పశువులను పట్టుకొని సురక్షిత గోశాలలు, సంరక్షణ కేంద్రాలకు తరలించడం జరుగుతుందనిపశువైద్య శాఖాధికారి డా. రవి చంద్ర తెలపడంతో పాటు,శంషాబాద్, జల్ పల్లి, ఆదిబట్ల మరియు బడంగ్ పేట్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు వీధి కుక్కల సమస్యలు లేదా అక్రమ మాంస విక్రయాలపై జిహెచ్ఎంసి టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్: 040-21111111 కు సమాచారం అందించాలని ఒక ప్రకటనలో తెలియజేశారు.

# కుమారుడి పుట్టినరోజు వేడుకలకు సేవా స్ఫూర్తి.. కంటి ఆసుపత్రికి రూ.లక్ష విరాళం

## పుష్పల మణిరాగ్ పుట్టినరోజు సందర్భంగా సామాజిక కార్యకర్త పుష్పల అజయ్ కుమార్ ఉదారత..వైద్య సేవలకు చేయూత

**కూకట్ పల్లి, అక్టోబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** పుట్టినరోజు వేడుకలను కేవలం ఆనందోత్సవాలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని నిరూపించారు సామాజిక కార్యకర్త పుష్పల అజయ్ కుమార్. తన కుమారుడు పుష్పల మణిరాగ్ పుట్టినరోజును పురస్కరించుకుని సాధురామ్ కంటి ఆసుపత్రికి రూ.లక్ష విరాళంగా అందజేసి తన సేవా నిరతిని చాటుకున్నారు. పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాలను సమాజ హితం కోసం వినియోగించాలనే ఆలోచనతో ఆయన అందించిన ఈ ఆర్థిక సహకారం పలువురి ప్రశంసలు అందుకుంది. సాధురామ్ కంటి ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్, ధర్మకర్త హరీష్ షహానీ, డాక్టర్ ఇన్సియా, శాసనసభ మార్షల్ వేణుగోపాల్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్పల అజయ్ కుమార్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా అందించిన ఈ విరాళం కంటి వైద్య సేవలకు తోడ్పడాలనే ఉద్దేశంతో చేసిన సేవా కార్యక్రమంగా నిలిచింది.



సమాజంలో ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అవసరమైన వైద్య సేవలను పొందలేకపోతున్నారు. ముఖ్యంగా కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి సరైన సమయంలో వైద్యం అందించడం ఎంతో అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రులకు దాతలు అందించే ఆర్థిక సహకారం వైద్య సేవల విస్తరణకు, అవసరమైన వారికి చికిత్స అందించేందుకు తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో పుష్పల అజయ్ కుమార్ అందించిన విరాళం ప్రాధాన్యతను సంతరించుకుంది. పుట్టినరోజు వేడుకలను సామాజిక బాధ్యతతో ముడిపెట్టి, వైద్య సేవలకు విరాళం అందించడం ద్వారా పుష్పల అజయ్ కుమార్ సమాజానికి సేవా సందేశాన్ని అందించారు. వ్యక్తిగత ఆనందంతో పాటు ఇతరుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల శ్రద్ధ చూపడం ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రతినిధులు పుష్పల అజయ్ కుమార్ అందించిన విరాళానికి కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం వల్ల మరింత మందికి వైద్య సహాయం అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కుమారుడి పుట్టినరోజును పురస్కరించుకుని కంటి ఆసుపత్రికి లక్ష రూపాయల విరాళం అందించిన పుష్పల అజయ్ కుమార్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో తన కుమారుడు పుష్పల మణిరాగ్ పుట్టినరోజు సందర్భంగా, సామాజిక కార్యకర్త పుష్పల అజయ్ కుమార్ సాధురామ్ కంటి ఆసుపత్రికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇన్సియా, అసెంబ్లీ మార్షల్ వేణుగోపాల్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో చూపించి ఘనత చాటుకోవడం కాదు.. ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించాలి

## మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌పై కాంగ్రెస్ నేత రావెళ్ల కృష్ణారావు ఘాటు విమర్శలు

## అభివృద్ధి పనులను రాజకీయం చేయడం మానుకోవాలి.. గత పాలనలో ఏం జరిగిందో ప్రజలకు తెలుసు

**కోదాడ, అక్టోబర్ 1 (క్రైమ్ మిర్రర్):** కోదాడలో 100 పడకల ప్రభుత్వాసుపత్రి విషయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ ఉనికిని చాటుకునే ప్రయత్నమేనని కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు విమర్శించారు. ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) చూపిస్తూ ఆసుపత్రి నిర్మాణం ఘనతను పూర్తిగా తన ఖాతాలో వేసుకోవడం సరికాదని, జీవో జారీ చేయడం ఒక్కటే ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చినట్లు కాదని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారంలో ఉన్న మల్లయ్య యాదవ్.. తన పదవీకాలంలోనే ఆసుపత్రి పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాల్సింది పోయి, అభివృద్ధి పనులను రాజకీయ వివాదాలుగా మార్చడం తగదని హితవు పలికారు.

**ఆధారాలుంటే ఆరోపణలు నిరూపించాలి**

స్థానిక ఎమ్మెల్యేపై కమీషన్ల ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని రావెళ్ల కృష్ణారావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలకు ఆధారాలుంటే వాటిని ప్రజల ముందు ఉంచాలని సవాల్ చేశారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని సూచించారు. రాజకీయ విమర్శలు చేసే ముందు వాస్తవాలను పరిశీలించాలని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి అంశాలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని పేర్కొన్నారు.

**గత పాలనలో ఏం జరిగిందో ప్రజలకు తెలుసు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ



నియోజకవర్గంలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టారు, ఎన్ని పనులు పూర్తయ్యాయి, మరెన్ని అసంపూర్తిగా మిగిలిపోయాయన్న విషయాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉందని రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులపై సమాధానం చెప్పకుండా, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేయడం వల్ల వాస్తవాలు మారవని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు, జారీ చేసిన జీవోలు అభివృద్ధి ప్రక్రియలో ఒక భాగమేనని, వాటి ద్వారా ప్రజలకు వాస్తవంగా ఎలాంటి ప్రయోజనం చేకూరిందన్నదే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎవరి పాత్ర ఎంత ఉందన్న అంశంపై చర్చించాలంటే ప్రభుత్వ రికార్డులు, పనుల పురోగతి, పూర్తయిన నిర్మాణాలను ఆధారంగా తీసుకోవాలని సూచించారు.

**ప్రజారోగ్య అంశాల్లో రాజకీయాలకు తావివ్వొద్దు**

కోదాడ ప్రభుత్వాసుపత్రి, డయాలసిస్ కేంద్రం వంటి ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని రావెళ్ల కృష్ణారావు అన్నారు. ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు మెరుగ్గా అందుబాటులోకి రావడం అత్యంత ముఖ్యమని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఆసుపత్రి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులందరిపైనా ఉందన్నారు.

**అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం**

కోదాడ నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని రావెళ్ల కృష్ణారావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన నిర్మాణాలు, అసంపూర్తిగా మిగిలిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధమని ప్రకటించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందినప్పుడే ప్రభుత్వ చర్యలకు సార్థకత ఉంటుందని అన్నారు.జీవోలు చూపించి ఘనతను సొంతం చేసుకోవడం కాదు.. పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు అందించాలి. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కల్పించారు అన్నది ముఖ్యం. కోదాడ అభివృద్ధిపై వాస్తవాల ఆధారంగా చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. అభివృద్ధి పనులను రాజకీయం చేయడం మానుకుని ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని రావెళ్ల కృష్ణారావు స్పష్టం చేశారు.

# రైతులకు విద్యుత్ కోతలు విధించకుండా 24 గంటల విద్యుత్ అందించాలి

## మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి :** రైతే రాజు అని కేసిఆర్ ప్రభుత్వంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందించి కెసిఆర్ రైతునే రాజును చేస్తే, ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వకుండా ఐదు, ఆరు గంటల విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు, గురువారం విద్యుత్ కోతలు లో ఓల్టేజ్ తో కష్టాలు పడుతున్న రైతాంగానికి మద్దతుగా నాంపల్లి మండలం సబ్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడపు నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తోడుంటామని చెప్పి, రైతు వ్యవసాయానికి సరిపడా విద్యుత్ ఇవ్వకుండా కోతలు విధిస్తూ, ఇబ్బందులు రైతులను పెడుతున్నారని ఆరోపించారు, దేశానికి రైతే వెన్నెముక, అలాంటి రైతులను గోస పెడితే ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు అతి త్వరలోనే వస్తాయి, డిండి ప్రాజెక్టు ను ప్రభుత్వం రద్దు చేయాలని కుట్ర పన్నుతుంది, అదే జరిగితే రైతులతో కలిసి పెద్ద ఉద్యమాన్ని చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్



మాట్లాడుతూ రైతుల వ్యవసాయానికి నిరంతరం కరెంటు ఇవ్వకుండా ప్రభుత్వం విఫలమయింది,అన్నారు శ్రీశైలం నుండి.రైతులకు 100 కిలోమీటర్లు ఉన్న మన ప్రాంతానికి సాగునీరు ఇవ్వకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం 600 కిలోమీటర్లు ఉన్న ఆంధ్రప్రదేశ్ కుప్పం నియోజకవర్గానికి సాగు నీరు ఎలా అందిస్తారని మండిపడ్డారు. బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించి నాణ్యమైన కరెంటు ఇవ్వాలని అదేవిధంగా 1200 వందల ట్రాన్స్ఫారాలు డీడీలు పెండింగ్లో ఉన్నాయి తక్షణమే ట్రాన్స్ఫార్మర్లు రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రైతులకు 24 గంటలు నాణ్యమైన కరెంటు అందించాలని, ఏ డి సాగర్ రెడ్డి, ఏఈ శివ ప్రసాద్ రెడ్డి ,విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు అనంతరం విద్యుత్ అధికారులు రైతులకు 12 గంటలు కరెంటు అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమాన్ని ముగించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పూదరి సైదులు, ఇట్టెశీ వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు నక్క రవీందర్, నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్, తుంగపాడు సర్పంచ్ కడారి శ్రీశైలం నేరళ్ళపల్లి సర్పంచ్ బాసిపాక రాములు, మాల్ మార్కెట్ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, బి ఆర్ ఎస్ నాయకులు అన్నెపర్తి శేఖర్, ఊరిపాక నగేష్, నాంపల్లి సంజీవ, సర్దార్ నాయక్ బుషిపాక ఏడుకొండలు, జెట్టన బోయిన శ్రీశైలం, గౌరి కిరణ్, మాజీ సర్పంచులు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# పాలకీడు పోలీస్ స్టేషన్ డీఎస్పీ వార్షిక తనిఖీ

## పలు రికార్డులు పరిశీలన నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** పాలకీడు పోలీస్‌స్టేషన్‌ను గురువారం డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణను సమీక్షించారు.గత మూడేళ్లలో నమోదైన హత్యలు, ప్రాపర్టీ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై నేరాలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ కేసులపై సమీక్ష నిర్వహించారు. పాలకీడు పరిధిలో మూడేళ్లుగా హత్య కేసులు నమోదు కాకపోవడంతో పాటు ప్రాపర్టీ నేరాలు తక్కువగా ఉన్నాయని డీఎస్పీ తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, ప్రమాదాలు జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు.సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అక్టోబర్ నెలంతా సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఐ కోటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# పదోన్నతితో మరింత ఉన్నత సేవలు అందించాలి

## ఎస్ఐగా పదోన్నతి పొందిన శ్రీనివాసులకు సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఘన సన్మానం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** ఎస్ఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న శ్రీనివాసులను వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ గురువారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో శ్రీనివాసులు చూపిన అంకితభావం, బాధ్యతాయుత సేవలను సర్పంచ్ అభినందించారు.పదోన్నతితో మరింత ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లోనూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీనివాసులను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన భవిష్యత్ సేవా ప్రయాణం విజయవంతంగా సాగాలని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయ రహదారి--44పై ప్రమాదాల నివారణకు అధికారుల స్పందన



గండిపేట్, క్రైమ్ మిర్రర్: జాతీయ రహదారి--44పై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు స్పందించారు. శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి, సంగీతా మొబైల్స్, ఆర్జీఐ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్, సవేరా హోటల్ పరిసర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, ఆయా ప్రాంతాల్లో శాశ్వతంగా ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సెప్టెంబర్ 29న హైదరాబాద్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ప్రజావెలుగు పార్టీ ప్రతినిధులు అంకగల్ల ప్రవీణ్ కుమార్‌తెలిపారు. వినతిపత్రంపై స్పందించిన సంబంధిత ప్రభుత్వ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, నేషనల్ హైవే, రోడ్లు--భవనాల శాఖ అధికారులు ఆయా ప్రమాదకర ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారిపై ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులు, వాహనాల రాకపోకలు, మార్కెట్ ప్రాంతంలో ఏర్పడుతున్న ఇబ్బందులు తదితర అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలిపారు.ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకునే దిశగా అధికారులు స్పందించడం పట్ల స్థానికులు, ప్రజావెలుగు పార్టీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగేలా కృషి చేసిన ప్రజావెలుగు పార్టీ టీమ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. జాతీయ రహదారి--44పై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను త్వరగా అమలు చేసి, వాహనదారులు, పాదచారులకు భద్రత కల్పించాలని ప్రజావెలుగు పార్టీ కోరింది.

# సింగరేణి క్వార్టర్ ఖాళీ ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధమే

**ఆరోపణలను తిరస్కరించిన జీఎం రాధాకృష్ణ**

**మద్ది శంకర్‌కు నిబంధనల ప్రకారమే నోటీసులు**

**మంత్రి వివేక్‌కు ముడిపెట్టడం సరికాదు**

**మందమర్రి అక్టోబర్ 1 (క్రైమ్ మిర్రర్):** గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నాయకుడు మద్ది శంకర్ నివాసముంటున్న సింగరేణి బి-40 క్వార్టర్‌ను అధికారులు ఖాళీ చేయించిన వ్యవహారంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్పందించారు. క్వార్టర్ ఖాళీ చేయించే ప్రక్రియ పూర్తిగా సంస్థ నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేశారు. గురువారం మందమర్రి జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మద్ది శంకర్ బి-40 క్వార్టర్‌లో ఎలాంటి అధికారిక అనుమతి లేకుండా నివాసముంటున్నట్లు విజిలెన్స్ విచారణలో తేలిందని జీఎం తెలిపారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగానే సంస్థ ఆస్తుల పరిరక్షణ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.




**వరుసగా నోటీసులు**

మొదట మద్ది శంకర్‌ను పిలిపించి క్వార్టర్ ఖాళీ చేయాలని సూచించామని, అధికారులతో కౌన్సెలింగ్ నిర్వహించామని రాధాకృష్ణ తెలిపారు. స్పందన లేకపోవడంతో ఆరో, ఏడో, ఎనిమిదో నెలల్లో మూడుసార్లు తెలుగులో నోటీసులు జారీ చేశామన్నారు. అనంతరం ఫామ్-ఏ, ఫామ్-బీ నోటీసులు కూడా ఇచ్చినట్లు వివరించారు. 2001లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం సింగరేణి ఆస్తుల్లోని ఆక్రమణలను తొలగించే అధికారం సంస్థకు ఉందన్నారు.

**మంత్రి వివేక్‌కు సంబంధం లేదు**

బి-40 క్వార్టర్ ఖాళీ చేయింపు వ్యవహారాన్ని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి ముడిపెట్టడం సరికాదని జీఎం స్పష్టం చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయం కోసం ఇప్పటికే బి-1 క్వార్టర్‌ను కేటాయించామని తెలిపారు. సంస్థ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకటికి మించి క్వార్టర్లు కేటాయించే అవకాశం లేదని, బి-40 క్వార్టర్ మంత్రికి అధికారికంగా కేటాయించలేదని వివరించారు.

**సామగ్రి భద్రంగా ఉంచాం**

నోటీసులకు స్పందన లేకపోవడంతో పోలీసు, ఎస్టేట్, సెక్యూరిటీ అధికారుల సమక్షంలో క్వార్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని రాధాకృష్ణ తెలిపారు. లోపల ఉన్న సామగ్రిని భద్రంగా తీసి కంపెనీ సెక్యూరిటీ ఆధీనంలో ఉంచినట్లు చెప్పారు. అనంతరం ఆ క్వార్టర్‌ను సంస్థలోని అర్హుడైన మరో ఉద్యోగికి కేటాయించినట్లు వెల్లడించారు. సింగరేణి సంస్థ నిబంధనలకు అనుగుణంగానే చర్యలు చేపట్టిందని రాజకీయ అంశాలను సంస్థ వ్యవహారాలకు ముడిపెట్టడం సరికాదని జీఎం అన్నారు.

# దళిత జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్య పోరాటమే మార్గం

**దళిత జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్య పోరాటమే మార్గం**

**బోధించు.. సమీకరించు.. పోరాడు.. నినాదంతో 11వ రాష్ట్ర మహాసభలకు సిద్ధం**

**వ్యాసకర్త: ముక్కగల్ల యాదన్న, సీనియర్ జర్నలిస్టు**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 02:** సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే బాధ్యతను పాత్రికేయులు నిర్వర్తిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలకమైన నాలుగో స్తంభంగా నిలుస్తోంది. అయితే ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల జీవితాల్లోనే అనేక సమస్యలు కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా దళిత జర్నలిస్టులు వృత్తిపరంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదుర్కొంటున్న సవాళ్లపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో దళిత జర్నలిస్టుల ఫోరం (డిజెఎఫ్) 11వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్నారు. పోతిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్‌లోని పిఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వేదికగా జరగనున్న ఈ మహాసభలు దళిత జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు వేదికగా నిలవనున్నాయి.

**హక్కుల కోసం సంఘటిత స్వరం**

దళిత జర్నలిస్టుల సమస్యలు వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామాజిక, వృత్తిపరమైన అంశాలుగా చూడాల్సిన అవసరం ఉంది. అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సదుపాయాలు, పిల్లల విద్య, రవాణా సౌకర్యాలు, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో దళిత జర్నలిస్టులకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలనే డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం, ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించడం వంటి అంశాలు కూడా మహాసభల డిమాండ్లలో ఉన్నాయి. జర్నలిజాన్ని వృత్తిగా కొనసాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారికి సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.

**కుటుంబ భద్రతకు ప్రాధాన్యం జర్నలిస్టుల**

కుటుంబాల ఆరోగ్యం, పిల్లల విద్య వంటి అంశాలు కూడా అత్యంత కీలకమైనవి. జర్నలిస్టుల కుటుంబాలకు సరిపడే ఆరోగ్య బీమా, పిల్లలకు ఉచిత విద్య, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు వంటి అంశాలను డిజెఎఫ్ డిమాండ్లుగా ముందుకు తెస్తోంది. అకాల మరణం చెందిన దళిత జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగభృతి, ఉచిత బస్, రైలు పాసులు వంటి సామాజిక భద్రతా చర్యలను కూడా కోరుతోంది. ఈ డిమాండ్లపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాలు, సామాజిక సంస్థలు చర్చించాల్సిన అవసరం ఉంది.

**ప్రాతినిధ్యం.. అవకాశాలు**

ప్రభుత్వ ప్రకటనల్లో పత్రికలు నిర్వహిస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అవకాశం కల్పించడం, ప్రెస్ అకాడమీ వంటి సంస్థల్లో దళిత జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించడం, సీనియర్ దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వడం వంటి అంశాలు కూడా డిమాండ్లలో ఉన్నాయి. ఇవి కేవలం పదవుల కోసం చేసే డిమాండ్లుగా కాకుండా నిర్ణయాత్మక వ్యవస్థల్లో ప్రాతినిధ్యం పెంచే అంశాలుగా చర్చించాలి. జర్నలిజం రంగంలో అనుభవం ఉన్నవారి సేవలను ప్రభుత్వ వ్యవస్థలు, మీడియా సంస్థలు, సామాజిక సంస్థలు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

**మహాసభలతో భవిష్యత్ కార్యాచరణ**

ఏ ఉద్యమమైనా సమస్యలను గుర్తించడం ఒక దశ అయితే, వాటి పరిష్కారం కోసం నిరంతర కార్యాచరణ రూపొందించడం మరో కీలక దశ. ఈ దిశగా 11వ రాష్ట్ర మహాసభల్లో దళిత జర్నలిస్టుల సమస్యలపై తీర్మానాలు చేసి, వాటి సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

బోధించు.. సమీకరించు.. పోరాడు.. అనే నినాదం దళిత జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘటిత చైతన్యాన్ని ప్రతిబింబిస్తోంది. హక్కులపై అవగాహన పెంచుకోవడం, జర్నలిస్టులను ఐక్యం చేయడం, రాజ్యాంగబద్ధమైన పద్ధతుల్లో సమస్యల పరిష్కారం కోసం పోరాడటం ద్వారా మాత్రమే ఆశించిన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుంది.

**సంగారెడ్డి వేదికగా జరగనున్న ఈ మహాసభలు**

దళిత జర్నలిస్టుల సమస్యలను చర్చించే ఒక ముఖ్యమైన వేదికగా నిలవాలి. మహాసభల్లో తీసుకునే తీర్మానాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వాటి అమలుకు నిరంతర కార్యాచరణ కొనసాగాలి. దళిత జర్నలిస్టుల హక్కులు, గౌరవం, వృత్తి భద్రత, కుటుంబ సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఇట్లు**

**మీ**

**ముక్కగల్ల యాదన్న, సీనియర్ జర్నలిస్టు**



## తిరుమలపూర్-1 అంగన్వాడి కేంద్రంలో ఘనంగా 'పోషణ మాసం' వేడుకలు

**గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి: సర్పంచ్ కాషా అంజలి గంగాధర్**

**అనీమియా నివారణకు సమతుల్య ఆహారం ముఖ్యం: సూపర్వైజర్ జానకి**

జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్): గొల్లపెల్లి సెక్టార్ పరిధిలోని తిరుమలపూర్-1 అంగన్వాడి కేంద్రంలో 'పోషణ మాసం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కాషా అంజలి గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు మరియు బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సూచిస్తూ మంచి పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ జానకి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత (అనీమియా) బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. దీనిని నివారించడానికి తాజా ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, మొలకెత్తిన గింజలను క్రమం తప్పకుండా ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే 'న్యూట్రి గార్డెన్' (పోషక ఉద్యానవనం) ఏర్పాటు చేసుకుని, తాజా కూరగాయలను పండించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ (౧౧=) పంపిణీ చేశారు.

**పాల్గొన్న ప్రముఖులు:** ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాషా అంజలి గంగాధర్, సూపర్వైజర్ జానకి, అంగన్వాడీ టీచర్లు లాల్బి, హరిత, రజిత, ఆశా కార్యకర్తలు వసంత, ఉమా, మంగ గర్భిణులు, బాలింతలు, తల్లులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో సంగారెడ్డి పోలీస్‌కు బంగారు పతకం

**5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో హెడ్ కానిస్టేబుల్ సంజీవ్ ప్రతిభ**

**విజేతను అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్**




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి: తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సంజీవ్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సంజీవ్‌ను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సంజీవ్‌ను ఎస్పీ ప్రోత్సహించారు.






## ప్రకృతి వ్యవసాయ ఇన్ ఫుట్ ల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి :** మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ముఖ్య ఉద్దేశాలు, సూత్రాలు, ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకుని తక్కువ పెట్టుబడితో, పర్యావరణ రహితంగా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించే విధానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ, జీవ వైవిధ్యం, తేమ సంరక్షణ, సహజ పద్ధతుల్లో చీడపీడల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయ ఇన్ ఫుట్ ల తయారీ, వినియోగంపై రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల సారాన్ని మెరుగుపరచి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చని అధికారులు తెలిపారు. రైతులు తమ ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించాలని సూచించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లక్ష్యాల సాధనలో రైతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బండారు శివ, నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్, వార్డు సభ్యులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఇతర సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

**గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పాకనాటి కన్నారెడ్డి**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పేద ప్రజల చిరకాల స్వప్నమైన సొంత ఇంటి కలను తెలంగాణ ప్రభుత్వం నెరవేరుస్తోందని గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పాకనాటి కన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు కర్ల పూజారాణి ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తుంబూరు దయాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని తెలిపారు. పేదలకు ఇళ్లు ఇస్తున్నందుకు ప్రజలంతా మంత్రి కి, తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటమల్ల పుల్లమ్మ , పంచాయతీ కార్యదర్శి మహేష్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తిగుళ్ల భాస్కర్, గ్రామ కాంగ్రెస్ నాయకులు తిగుళ్ల భవాని, మేకల అర్జున్, చెరుకుపల్లి రాజేష్, చెరుకుపల్లి ఉపేందర్, వడ్లమూడి నరసయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, కర్ల అశోక్, కుమ్మరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.